RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక : 38 | శనివారం16. 5. 2026 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్ | పేజీలు : 8 | వెల: 2.00

తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## కేసీఆర్ ఉంటే రెండేళ్ల క్రితమే పూర్తయ్యేది

- భేషజాలకు పోవద్దు..
- టిమ్స్ ఆసుపత్రులను అందుబాటులోకి తేవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్



**హైదరాబాద్:(తెలంగాణ వాణి)**

హైదరాబాద్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలను చేరువ చేయాలనే సంకల్పంతోనే కేసీఆర్ ప్రభుత్వం టిమ్స్ హాస్పిటల్స్‌కు అంకురార్పణ చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సనత్‌నగర్ 'టిమ్స్' నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రత్యేకతలు, గత ప్రభుత్వ కృషిని వివరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కేవలం గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులపైనే భారం ఉండేదని, కానీ నేడు అంతర్జాతీయ ప్రమాణాలతో టిమ్స్ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ాా××మీ స్థాయి వైద్యం అందించాలనేది కేసీఆర్ విజన్ అని ఆయన స్పష్టం చేశారు. మొత్తం 22 ఎకరాల విశాలమైన ప్రాంగణంలో 'టిమ్స్' నిర్మాణం జరిగిందని, దాదాపు రూ.1,200 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దినట్లుగా వెల్లడించారు. 300 ఐసీయూ బెడ్లతో సహా వేలాది మందికి చికిత్స అందించే సదుపాయం ఉందని అన్నారు. 16 ఆపరేషన్ థియేటర్లు, ఎంఆర్ఐ , సీటీ స్కాన్ వంటి డయాగ్నస్టిక్ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కిడ్నీ సంబంధిత వ్యాధులపై ప్రత్యేక పరిశోధన కేంద్రాలు, రీసెర్చ్ బ్లాక్స్ కూడా ఏర్పాటు చేశారని కేటీఆర్ తెలిపారు.

### ప్రజా వైద్యంలో విప్లవాత్మక మార్పులు..

నగరంలోని సనత్‌నగర్, ఎల్‌బీ నగర్, ఆల్వాల్ ప్రాంతాల్లో 'టిమ్స్' ఏర్పాటు చేశామని, వరంగల్‌లో 2,000 పడకలతో మరో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో ఉందని కేటీఆర్ గుర్తుచేశారు. నిమ్స్ విస్తరణతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 350 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి వైద్య వ్యవస్థను ప్రజల వద్దకు తీసుకెళ్లామని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం కొనసాగి ఉంటే 'టిమ్స్' ఆసుపత్రి రెండేళ్ల క్రితమే పూర్తయ్యేదని అన్నారు. మిగిలి ఉన్న పనులను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. రోగుల బంధువుల కోసం ధర్మశాల, 1,000 కార్ల పార్కింగ్, ఎమర్జెన్సీ ర్యాంప్ వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కేటీఆర్ ప్రజలకు సూచించారు.




## సామాన్యుడి జేబుకు చిల్లు..

**ఢిల్లీ:(త్రివర్ణ భూమి)**

దేశవ్యాప్తంగా వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ షాకిచ్చింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు సగటున రూ.3 పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి.

పెరిగిన ధరలతో దేశ రాజధాని న్యూఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.97.77, డీజిల్ రూ.90.67కి పెరిగింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై రూ.3.39, డీజిల్‌పై రూ.3.26 వరకు పెరిగింది. దీంతో హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.110.89, డీజిల్ ధర రూ.98.96కి చేరింది. ఏపీలో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14 పెరిగింది. ఇక ముంబైలో పెట్రోల్ ధర రూ.106.68, డీజిల్ ధర రూ.95.13కి చేరింది. చెన్నైలో పెట్రోల్ ధర రూ.10.3.67, డీజిల్ ధర రూ.95.25కి పెరిగింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల కారణంగా ఆయిల్ కంపెనీలపై భారం పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్రధాని మోదీ పొదుపు మంత్రం పాటించాలని చెప్పిన రెండు మూడు రోజుల్లోనే ఈ ధరలు పెరగడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ఇంధన ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. తద్వారా నిత్యవసర వస్తువుల ధరలు, ప్రయాణచార్జీలు తదితర రంగాలపై దీని ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

### తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు

అంతర్జాతీయ ఉద్రిక్తతల(ఇరాన్-ఇజ్రాయెల్ వివాదం) కారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయ వంట గ్యాస్(గ్రా+) సిలిండర్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. గత నెలలో ఇంట్లో ఉపయోగించే సాధారణ వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 60 పెరిగింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో 14.2 కిలోల సిలిండర్ ధర సుమారు రూ. 965కు చేరుకుంది. ఇప్పటికీ నగరంలో గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. కానీ, ఈ నెల(మే) ఒకటో తేదీన చమురు కంపెనీల వాణిజ్య అవసరాల కోసం వినియోగించే 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ నిర్ణయం సుకున్నాయి. దీంతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ ధర రూ.3,069కు చేరుకుంది

## 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్

### బుల్లెట్ ట్రైన్ కారిడార్లపై సీఎస్ కీలక సమీక్ష!

**హైదరాబాద్:(తెలంగాణ వాణి)**

తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టబోతున్న మూడు భారీ హైస్పీడ్ రైలు (బుల్లెట్ రైలు) కారిడార్ ప్రాజెక్టుల తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే లక్ష్యంతో హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదించిన మూడు భారీ హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు,



పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు. హైదరాబాద్ -- పూనే -- ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డీపీఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ -- బెంగళూరు కారిడార్, హైదరాబాద్ -- చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు.

## 30 నెలల్లో పూర్తి చేస్తామన్నారు.. పదేళ్లైనా చుక్కనీరు ఇవ్వలేదు..

### తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్:(తెలంగాణ వాణి)**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులపై రూ. 1.21 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా ఎందుకు నీళ్లు రాలేదని ప్రశ్నించారు. ఇవాళ ఓ మీడియా సంస్థ నిర్వహించిన కాన్క్లేవ్ మాట్లాడిన కవిత... పాలమూరు-రంగారెడ్డిని 30 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి పదేళ్లైనా చుక్కనీరు ఇవ్వలేకపోయారని దుయ్యబట్టారు. రూ.32వేల కోట్ల అంచనాలతో మొదలైన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు అంచనాలు ఇప్పుడు రూ.80వేల కోట్లకు పెరిగాయన్నారు. నీటి వినియోగంలో తెలంగాణ ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. 35 లక్షల ఎకరాలతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణలోనే అత్యంత పెద్ జిల్లా కానీ ఈ జిల్లా నుంచి ఇప్పటికీ వలసలు ఉన్నాయని రాష్ట్రం వచ్చి 12 ఏళ్లు అవుతున్నా వలసలు ఆగలేదని ఈ పరిస్థితి మారాలన్నారు. ఈ దేశంలో ఏ మార్పు వచ్చిన అది రాజకీయంగానే వచ్చిందని ఈ దేశంలోని అన్ని సమస్యలపై స్పందించేది కేవలం ఒక రాజకీయనాయకులు మాత్రమేనన్నారు. నేపాల్ లో జెన్ జీ ప్రభుత్వాన్నే మార్చివేశారని కానీ మన దేశంలో మన పిల్లలను రాజకీయానికి దూరంగా ంచుతున్నామన్నారు. మాతో కలిసి కలవండి అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కవిత.. వీళ్లు ఎప్పటి నుంచో కలిసి ఉన్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ సీఎం అని ఇప్పిటకే చెప్పామన్నారు. రాష్ట్రానికి అనేక ప్రాజెక్టులు రాకపోయిన కేంద్రాన్ని ప్రశ్నించడం లేదు అడగడం లేదున్నారు.




**ఢిల్లీ:(త్రివర్ణ భూమి)**

అమెరికన్ డాలర్ తో పోలిస్తే.. రూపాయి విలువ మరింత పతనమైంది. శుక్రవారం మధ్యాహ్నం ఇన్ ట్రా డే లో గతంలో ఎన్నడూ లేని రీతిలో.. రూపాయి విలువ జీవితకాల కనిష్ఠానికి చేరుకోవడం గమనార్హం. ఈ పరిణామం భారత్ బాహ్య రంగానికి సవాళ్లను మరింత పెంచుతోంది. యూఎస్ డాలర్ తో పోలిస్తే.. రూపాయి విలువ 0.3 శాతం క్షీణించి 96.07 వద్దకు పడిపోయింది. గత సెషన్లో రూపాయి విలువ 95.9575 కనిష్టానికి చేరుగా.. తాజాగా మరింత పతనమై కొత్త రికార్డును నమోదు చేసింది. గ్లోబల్ మార్కెట్లో నెలకొన్న ఒత్తిడుల కారణంగా రూపాయి మారకం విలువ వరుసగా పతనమవ్వడం.. ఆర్థిక వర్గాల్లో ఆందోళనను పెంచుతోంది.రూపాయి విలువ పతనమవ్వడానికి కారణం.. చమురు దిగుమతులు పెరగడమేనని నిపుణులు చెబుతున్నారు. భారత్ తన అవసరాలకు కావలసిన చమురులో 80 శాతంకంటే ఎక్కువ దిగుమతి చేసుకుంటోందని, దీంతో చమురు ధరలు బ్యారెల్ కు 110 డాలర్లకు చేరగా.. దిగుమతుల భారం పెరిగి డాలర్లకు డిమాండ్ ఏర్పడటం వల్ల రూపాయి విలువ పతనమైనట్లు వివరించారు. ఇంధన దిగుమతుల ఖర్చులు పెరిగితే.. దాని ప్రభావం ట్రేడ్ డెఫిసిట్ పై తీవ్రంగా ఉంటుందని తెలిపారు.

## బండి భగీరథ్‌పై పోక్సో కేసు.. బాలిక వివరాలు సోషల్ మీడియాలో పెట్టిన వారిపై కేసు నమోదు

**హైదరాబాద్:(తెలంగాణ వాణి)**

తీవ్ర సంచలనం సృష్టిస్తున్న బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో బాలిక వివరాలు సోషల్ మీడియాలో ప్రసారం చేసిన వారికి పోలీసులు షాకిచ్చారు. సోషల్ మీడియాలో బాలిక ఫోటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాలు ప్రసారం చేసిన సోషల్ మీడియా నిర్వాహకులపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఫిర్యాదు మేరకు జువెనైల్ జస్టిస్ యాక్ట్ - సెక్షన్ 74 (మైనర్ల గుర్తింపును బహిర్గతం చేయడంపై నిషేధం), జువెనైల్ జస్టిస్ యాక్ట్ - సెక్షన్ 74 (మైనర్ల గుర్తింపును బహిర్గతం చేయడంపై నిషేధం) సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బాలిక ఆమె కుటుంబ వివరాలు బహిర్గతం చేసేలా కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల ఐడీలు, సంబంధిత ఖ=ాల ద్వారా ఆయా ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

## పెట్టుబడుల ఆకర్షణతో యువతకు ఉపాధి అవకాశాలు

**సంగారెడ్డి: (తెలంగాణ వాణి)**

పెట్టుబడుల ఆకర్షణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. సంగారెడ్డి జిల్లా తోగర్‌పల్లిలో కేజేఎస్ పరిశ్రమకు మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. "పరిశ్రమలు, పెట్టుబడుల కోసం పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నాం. జహీరాబాద్‌లో నిమ్జ్ మాన్యుఫ్యాకర్చింగ్ జోన్ కోసం ఇప్పటికే చర్యలు చేపట్టాం. ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాం. యువత నైపుణ్యాలు మెరుగుపర్చి రాష్ట్రాన్ని శక్తిమంతంగా మార్చేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నాం" అని శ్రీధర్‌బాబు వివరించారు.

## ఎస్ఐఆర్ హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు: మహేశ్‌గౌడ్



**హైదరాబాద్:(తెలంగాణ వాణి)**

ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృదం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. "గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ ప్రక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలి. జనగణన ప్రక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలి. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలి" అని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్: ధర్మేంద్ర ప్రధాన్



**ఢిల్లీ:(త్రివర్ణ భూమి)**

నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. 'జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి. ఈసారి ఎలాంటి రిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు ఆందోళన చెందొద్దు.

## బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ బండి రజనీకుమార్**



**హసన్ పర్తి మే15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథపై నమోదైన ఫోక్సో కేసులో వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హసన్‌పర్తి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మైనర్ బాలికను లైంగికంగా వేధించారనే ఆరోపణలతో బాధిత కుటుంబం ఈ నెల 8న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సిట్ విచారణకు కూడా ఆదేశాలు జారీ చేసిందని, పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ బండి భగీరథ విచారణకు హాజరుకాకుండా పరారీలో ఉన్నారని, ఎనిమిది రోజులు గడిచినా అరెస్ట్ చేయక పోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు ఒక న్యాయం, మంత్రి కుమారుడికి మరో న్యాయమా అని ప్రశ్నించారు. మైనర్ బాలిక ఫోటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఫోక్సో కేసును ఎదుర్కొంటున్న బండి భగీరథపై లుక్అవుట్ నోటీసులు జారీ చేసి వెంటనే కస్టడీలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిపల్లి సొసైటీ మాజీ చైర్మన్ జక్కు రమేష్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ కొండపాక సుభాష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ బండ రత్నాకర్ రెడ్డి, సర్పంచులు రంజిత్ గౌడ్, భగవాన్ రెడ్డి, నాగారం అరుణ్ , మల్లారెడ్డి, చేతపాక చిన్ని, బీఆర్ఎస్వి కేయూ ఇంచార్జ్ డాక్టర్ జెట్టి రాజేందర్, భాషబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ తెల్లాపూర్‌లో బడిబాట కార్యమ్రానికి విశేష స్పందన

**రెండో రోజు కార్యక్రమం విజయవంతం.**







**తెలాపూర్ మే 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" కార్యక్రమం 2026--27 విద్యాసంవత్సరానికి సంబంధించి జడ్పీహెచ్ఎస్ తెల్లాపూర్ పాఠశాలలో విజయవంతంగా కొనసాగుతోంది. హెడ్‌మాస్టర్ టి. భాస్కర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు హరి శంకర్ గారు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం కలిసి బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలు, డిజిటల్ తరగతులు, ాౄ× ఆధారిత అభ్యాసం, ఖీూచీ, డిజిటల్ లిటరసీ, నాణ్యమైన బోధన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తున్నారు.బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రెండో రోజు కార్యక్రమం కూడా విజయవంతంగా జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. మొదటి రోజు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభించడంతో పాటు రెండు కొత్త అడ్మిషన్లు నమోదైనట్లు ఉపాధ్యాయులు హరి శంకర్ గారు వెల్లడించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, నైపుణ్య ఆధారిత విద్యపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని పాఠశాల ఉపాధ్యాయ బృందం పేర్కొంది. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు సహకరించాలని హెడ్‌మాస్టర్ టి. భాస్కర్ కోరారు.

## రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు చేర్చాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



**నిర్మల్,మే:15(తెలంగాణ వాణి ప్రతినిధి)**
రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు తరలించి భద్రపరచాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) గ్రామంలో గల గోదామును పరిశీలించారు. ధాన్యం అన్లోడ్ అవుతున్న తీరును చూశారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇప్పటివరకు గోదాములో నిల్వచేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తగినంత మంది హమాలీలతో అన్లోడింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి, లారీలను వేగవంతంగా ఖాళీ చేయాలన్నారు. అన్లోడింగ్ పూర్తయిన వెంటనే లారీలు తిరిగి కొనుగోలు కేంద్రాలకు తిరిగి పంపాలని తెలిపారు. ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యం నిల్వ ఉండరాదని అన్నారు. ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ఈ గోదాము పరిశీలన ప్రక్రియలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్ తహసిల్దార్ విజయ కాంతారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాంసాగర్ గ్రామంలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

- **డిఆర్ డిఓ జయదేవ్ ఆర్య**
- **వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని కోరిన**

**సర్పంచ్ అక్కేనపల్లి రాజ్యాలక్ష్మి మల్లారెడ్డి**





**కొమురవెల్లి, మే15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని రాంసాగర్ గ్రామాన్ని డి ఆర్ డి ఓ జయదేవ్ ఆర్య శుక్రవారం రోజున ఉపాధి హామీ పనుల పరిశీలన నిమిత్తం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి, కూలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తెలిపారు.
ఉపాధి హామీ ద్వారా ఎక్కువ మందికి ఉపాధి కల్పించి, వారికి సకాలంలో చెల్లింపులు జరిగితే, అందులో 60 శాతం నిధులు గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సీసీ రోడ్లు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.అనంతరం వడ్ల మార్కెట్ యార్డును సందర్శించగా గ్రామ సర్పంచ్ అక్కేనపల్లి రాజ్యాలక్ష్మి మల్లారెడ్డి వడ్ల కొనుగోలు కేంద్రంలో ఉన్న ఒక జల్లి మిషన్ గత 10 రోజులుగా పనిచేయకపోవడం గురించి మరియు లారీలు సకాలంలో వచ్చేటట్టు చూడాలని వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన డి ఆర్ డి ఓ ఈరోజు సాయంత్రం లోపు మోటర్ మార్చి మిషన్‌ను సరిచేయాలని, లేకపోతే కొత్త మిషన్ కొనుగోలు చేయాలని, వడ్లు పట్టే యంత్రాలు మరియు ఇతర సదుపాయాలు సక్రమంగా పనిచేసేలా చూసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఐకెపి సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో కొమురవెల్లి ఎంపీడీవో బండి లక్ష్మప్ప ,ఫీల్డ్ ఆఫీసర్ లింగం ,రాం సాగర్ గ్రామ సర్పంచ్ అక్కేనపల్లి రాజ్యాలక్ష్మి మల్లారెడ్డి , ఉప సర్పంచ్ ఏసి రెడ్డి మల్లారెడ్డి, నాయకులు ప్రవీణ్ రెడ్డి, సంపత్ రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, ఐకెపి సిబ్బంది రైతులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యశోదలో కోమా పేషెంట్‌కు అరుదైన శస్త్ర చికిత్స

- **ప్రాణాలు కాపాడిన ప్రముఖ వైద్యులు.**
- **వివరాలు వెల్లడించిన ప్రముఖ న్యూరో సర్జన్ కె ఎస్ కిరణ్.**




**నిజామాబాద్, మే 15( తెలంగాణ వాణి ప్రతినిధి)**
రోడ్డు ప్రమాదానికి గురై కోమాలో ఉన్న పేషెంట్ కు సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రి లో అరుదైన శస్త్ర చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. దీనికి సంబంధించిన వివరాలను యశోద ఆసుపత్రి ప్రముఖ న్యూరో సర్జన్ కె ఎస్ కిరణ్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని యశోద మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కె ఎస్ కిరణ్ మాట్లాడుతూ శస్త్ర చికిత్స సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన సుద్దులం గ్రామ నివాసి 35 సంవత్సరాల జక్కు ప్రశాంత్ గత సెప్టెంబర్ మాసంలో విధులు నిర్వహించుకొని ఇంటికి వెళుతున్న సమయంలో రోడ్డుపైన కుక్క అడ్డం వచ్చి కింద పడటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించకపోవడంతో తలకు, ముఖానికి తీవ్ర గాయాలై కోమలోకి వెళ్లాడన్నారు. ప్రాణపాయ స్థితిలో ఉన్న అతన్ని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తీసుకువచ్చారన్నారు. రెండు నెలలు కోమలో ఉన్న పేషెంట్ ని అత్యాధునిక పరికరాలతోటీ సి డి , (ట్రాన్స్ క్లీనల్ డాప్లర్,) ఐ సి పీఎం(ఇంట్రా క్రినల్ ప్రెషర్ మానిటరింగ్ ) ఎం ఆర్ ఐ, డీ టి ఐ , ఇమేజెస్ అండ్ పర్ఫ్యూజన్ స్కామ్స్ పలు రకాల శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరిగిందన్నారు. రెండు నెలల చికిత్స అనంతరం రోగి సంపూర్ణ ఆరోగ్యంగా బయటపడ్డారన్నారు. గ్రేడ్ త్రి హెడ్ ఇంజురీ కారణంగా పేషంటు ప్రమాదం జరిగిన వెంటనే కోమలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రేడ్ వన్, గ్రేడ్ 2 ప్రమాదాలు స్వల్ప గాయాలతో ప్రాణాపాయ స్థితి నుండి బయట పడవచ్చని గ్రేట్ త్రీ వల్ల అత్యంత ప్రమాదకరం కావడంతో అత్యాధునిక పరికరాలతో చికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ప్రయాణం చేస్తే ప్రమాదం జరిగిన ఎలాంటి ప్రాణహాని ఉండదన్నారు. అనంతరం పేషంట్ ప్రశాంత్ మాట్లాడుతూ, తనకు పునర్జన్మ ని ఇచ్చిన డాక్టర్ కె. ఎస్ కిరణ్ తనకు దైవంతో సమానం అన్నారు. తన ప్రాణాలు కాపాడిన డాక్టర్ కు జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ విలేఖరుల సమావేశంలో ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ శ్రీరామ్ సురేష్, సరళ, పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలి

- **బీబీ నగర్ ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య చికిత్సలు..**
- **సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ ...**



**నిజామాబాద్ మే 15: (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలను ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులు అనవసరంగా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలు కావద్దన్నారు. ప్రభుత్వపరంగా అనేక ఆసుపత్రులు ఉత్తమ చికిత్సలు అందజేస్తున్నా యన్నారు. జిల్లా కేంద్రంలోని జిజిహెచ్ లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన చికిత్స అందుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బీబీనగర్ లో ఏర్పాటుచేసిన ఎయిమ్స్ లో అత్యాధునిక చికిత్సలను అందజే స్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే నిమ్స్ లోనూ చికిత్స కోసం ఎల్వోసీ అవసరమైతే తమ వద్ద కు రావాల న్నారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల బిల్లులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాధితులు దరఖాస్తు చేసుకున్న వాటిలో వారు 60 శాతం పైగా ఇవ్వాలని కోరారు. అనంతరం మొత్తం 97 మంది లబ్ధిదారులకు రూ.21,43,000 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, మఠం పవన్, ఎర్రం సుధీర్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, బంటు ప్రీతి ప్రవీణ్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం

- **రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి**
- **ఆర్.టీ.ఐ చట్టంపై పీఐఓలు, ఏపీఐఓలకు అవగాహన సదస్సు**




**నిజామాబాద్, మే 15 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం - 2005 పై పీఐఓలకు, ఏపీఐఓలకు, అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, సమాచార కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్ లు హాజరయ్యారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం ప్రజలకు సంబంధించినదే అయినందున దానిని వారికి తెలుపడంలో అలసత్వ వైఖరి తగదని హితవు పలికారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజాసేవకులం అన్న విషయాన్ని మరువరాదని సూచించారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంలోని 2 షెడ్యూళ్ళు, 6 చాప్టర్లు, 31 సెక్షన్ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు సంబంధించి పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓల సందేహాలను నివృత్తి చేశారు. థర్డ్ పార్టీ ఇన్ఫర్మేషన్, వ్యక్తిగతంగా అడిగే సమాచారం, ఇవ్వవలసిన సమాచారం, ఇవ్వకూడని సమాచారం, తదితర వాటి గురించి సవివరంగా తెలియజేశారు ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. సమాచార చట్టం ప్రకారం సమాచారాన్ని కోరే హక్కు ప్రతి పౌరునికి ఉండడంతో పాటు, రికార్డులను, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించే అధికారం కూడా ఉందని తెలిపారు. పౌరులు కోరినప్పుడే సమాచారం ఇవ్వడం కాకుండా, సమాచార హక్కు చట్టం, సెక్షన్ 4(1)బి ప్రకారం స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చేలా అధికార యంత్రంగాలు సమాయత్తం కావాలని సూచించారు. పబ్లిక్ అథారిటీ బాధ్యతలు, విధులు, నిర్వర్తించే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు 4(1) బి రిజిస్టర్లను అప్డేట్ చేసుకోవాలని, వీటన్నిటిని ప్రజలకు తెలిసేవిధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం లక్ష మందికి సమాచారం అందించడం జరిగిందని తెలిపారు. మరో 15000 వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 20 జిల్లాలలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని, సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరుకున్న సమాచారాన్ని పొందే అవకాశం ఉన్నందున పిఐఓలు, అధికార యంత్రంగాలు ప్రజల పక్షాన ఆలోచించి అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని అన్నారు.

రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు భారతదేశంలో అమలు చేస్తున్న వివరాలు తెలియజేస్తూ అధికార యంత్రంగాలు, పిఐఓలు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 1766 లోనే స్వీడన్ దేశంలో సమాచార హక్కు చట్టం అమలు ప్రారంభమైందని, 2005 సంవత్సరంలో భారతదేశంలో ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రపంచ దేశాల పరంగా చూస్తే ఆర్.టీ.ఐ అమలు విషయంలో భారతదేశం 4వ స్థానంలో ఉందని, దీని అమలును మరింత సమర్ధవంతంగా చేస్తూ మన దేశాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సమాచార కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు, ఉద్దేశ్యాలు, 4(1)ఎ కింద ఇచ్చే సమాచారం తెలియజేస్తూ ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో వివరాలను అప్డేట్ చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగాలపై ఉందని సూచించారు. సమాచార హక్కు చట్టంలోని 6(3) కింద దరఖాస్తును చక్కగా చదివి ఆకళింపు చేసుకోవాలని, ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ సరైన రీతిలో స్పందిస్తే సెకండ్ అప్పీలేట్ అథారిటీ వరకు అప్పీల్స్ అన్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులు అనగానే అనేక మంది ఆందోళనకు గురి అవుతారని, ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురి కాకుండా దరఖాస్తుదారు కోరిన మేరకు రికార్డులలో ఉన్న సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ కేసులను ఆర్.టీ.ఐ కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లు పరిశీలించి పరిష్కరించారు.

కాగా, సదస్సుకు హాజరైన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి, కమిషనర్లు దేశాల భూపాల్, పీ.వీ.శ్రీనివాస్ రావులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. సదస్సులో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థ్ విక్రం సింగ్, అదనపు డీ.సీ.పీ ప్రకాశ్, డీ.ఆర్.ఓ బి.గీత, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి




**ఎల్లారెడ్డి, మే 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎల్లారెడ్డి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన "ఫ్రైడే -- డ్రైడే" కార్యక్రమం సందర్భంగా డెంగీ వ్యాధి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది. వైద్యాధికారి డాక్టర్ శరత్‌కుమార్ పర్యవేక్షణలో, ఎల్లారెడ్డి డివిజన్ సబ్ యూనిట్ ఆఫీసర్ పాశం గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పట్టణంలోని దోభి గల్లీ, కుమ్మరి గల్లీ, ఆదర్శ నగర్ ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి ఫీవర్ మరియు లార్వా సర్వే నిర్వహించారు. లార్వా దశలు ఉన్న నీటి వనరులను తొలగించడం జరిగింది. ప్రతి ఇంటిలో నిల్వ ఉంచిన నీటి వనరులను తప్పనిసరిగా మూతలు పెట్టి ఉంచాలని, దోమలు గుడ్లు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మత్తమాల భాగ్యవతి మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్తను స్వచ్ఛ ఆటోకు అందించాలని, చెత్తను రోడ్లపై వేయరాదని తెలిపారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ వెంకటేశం, ఎల్లారెడ్డి డివిజన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఠాగూర్, ఎల్లారెడ్డి ఏ మరియు బి ఇందిరా, సరిత, ఆరోగ్య కార్యకర్తలు లావణ్య, సంధ్య, ప్రమీల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో భారీ మార్పులు

### పార్టీ బలోపేతానికి కొత్త కమిటీల ఏర్పాటు

**ఎల్లారెడ్డి మే 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి మరింత బలోపేతం చేయడానికి విస్తృత స్థాయిలో సంస్థాగత మార్పులు చేపడుతున్నామనీ,గ్రామాలు మరియు పట్టణాలలో పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు క్రింది హోదాలకు కొత్త అధ్యక్షుల నియామకం చేపట్టబడుతుందనీ కాంగ్రెస్ నాయకులు అన్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుపట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బీసీ సెల్ అధ్యక్షులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు, ఎస్టీ సెల్ అధ్యక్షులు, మైనార్టీ సెల్ అధ్యక్షులు, కిసాన్ సెల్ అధ్యక్షులు, యువజన మరియు ఇతర అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియామకం చేపట్టబడుతుందనీ,ఇప్పటికే బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రతి నాయకుడు గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని, అలాగే జూన్ 2వ తేదీన మండలంలోని ప్రతి గ్రామంలో మరియు పట్టణంలో గ్రామ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించబడింది.

## మే 18 నుంచి 23 వరకు 'యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్' కార్యక్రమాలు నిర్వహణ

### గోడపత్రిక విడుదల చేసిన హేమంత్ కేశవ్ పాటిల్




**నాగర్ కర్నూల్ మే 15 (తెలంగాణ వాణి)**
యువతలో క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపుదల లక్ష్యం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆరు రోజుల ప్రత్యేక కార్యక్రమాలుయువజన సంఘాలు, ఎన్‌జీఓలు, క్రీడా సంఘాలు, క్రీడాకారులు భారీగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టర్ ఛాంబర్ లో గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. మే 18న "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ" పేరుతో 2కే, 5కే రన్ కార్యక్రమాలు, మే 19న కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు, మే 20న యువతకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ కార్యక్రమాలు, మే 21న జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ డే నిర్వహణ, మే 22న స్వచ్ఛ తెలంగాణ కోసం శ్రమదానం కార్యక్రమాలు, మే 23న ఉద్యోగ సాధన, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్డీఓ సురేశ్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు. జిల్లా యువజన, క్రీడల అధికారి వి. సీతారాం పాల్గొన్నారు.

## జ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు

### -కలెక్టర్ చిత్రా మిశ్రా, చైర్మన్ సత్తు మల్లేష్





**కరీంనగర్ మే 15 (తెలంగాణ వాణి)**
గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిల్వ కేంద్రాలు మాత్రమే కావు, సమాజానికి విజ్ఞానాన్ని పంచే జ్ఞానాలయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ సత్తు మల్లేష్ అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల'లో భాగంగా శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకోడే, మేయర్ కోలగని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిలతో కలిసి ఆయన హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం సత్తు మల్లేష్ మాట్లాడుతూ.. నేటి యువత మొబైల్ ఫోన్లకే పరిమితం కాకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి నిత్యం కొంత సమయం గ్రంథాలయంలో గడిపితే ఆలోచనా విధానం, వ్యక్తిత్వ వికాసం మెరుగుపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే పలువురు పూర్వ పాఠకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, స్థానిక కార్పొరేటర్ పడాల శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీల సంక్షేమం, హక్కుల రక్షణకు కట్టుబడి ఉన్నాం

- అట్రాసిటీ కేసుల్లో జాప్యం లేకుండా పరిహారం అందించాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, మే : 15 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లాలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) సంక్షేమానికి, వారి చట్టపరమైన హక్కుల రక్షణకు యంత్రాంగం పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, ఎస్సీ సామాజిక వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చట్టపరమైన రక్షణలు క్షేత్రస్థాయిలోని అర్హులైన నిరుపేదలకు నేరుగా చేరాలని ఆకాంక్షించారు. దళితవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంక్షేమ నిధుల వినియోగంలో పూర్తి




పారదర్శకత పాటించాలని, బాధితులకు సకాలంలో న్యాయంతో పాటు పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఎస్సీల రక్షణకు సంబంధించిన చట్టాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ కమిటీ తరచుగా సమావేశమై కేసుల పురోగతిని సమీక్షించాలని, ఎస్సీలపై ఎలాంటి వేధింపులు జరగకుండా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ స్థాయిలో పౌర హక్కుల దినోత్సవాలను పకడ్బందీగా నిర్వహించి ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. అర్హులైన ఎస్సీ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం ఉపాధి పథకాల ద్వారా పూర్తి స్థాయిలో చేయూతనిస్తామని కలెక్టర్ వెల్లడించారు. వివిధ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ ఋత్విక్ సాయి కొట్టే, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీవో జగదీశ్వర్ రావ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి: వరంగల్ సిపి సన్‌ప్రీత్ సింగ్

**హన్మకొండ:మే 15(తెలంగాణ వాణి ప్రతినిది)**
పోలీస్ చెక్ పోస్టుల్లో సిబ్బంది తప్పని సరిగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. గోవులతో పాటు మూగ జీవాల అక్రమ రవాణా నియంత్రణ చేసేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరిహద్దుల్లో ప్రత్యేకంగా పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చెక్ పోస్టుల్లో సిబ్బంది పనితీరును పరిశీలించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కటాక్షపూర్ పోలీస్ చెక్‌పోస్ట్‌ను అకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీ భాగంగా ముందుగా పోలీస్ కమిషనర్ చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన బారీకేడ్లను పరిశీలించడంతో పాటు, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వివరాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం సిపి




ఈ చెక్‌పోస్ట్‌లో రికార్డుల నిర్వహ ణ,వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకోని చెక్‌పోస్ట్‌లో సిబ్బంది కోసం ఎయిర్‌కూలర్,మంచి నీటి ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషన ర్ చెక్‌పోస్ట్ సిబ్బంది పలు సూచనలు చేస్తూ పోలీస్ సిబ్బంది నిరంతరం తనిఖీలు నిర్వహించాలని,ముఖ్యంగా ఇక్కడ నియమించబడిన సిబ్బందిలో సగం మంది తనిఖీ నిర్వహించాలని,మరో సగం మంది విశ్రాంతి తీసుకో వాల్సి వుంటుందని. ముఖ్యం గా ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేయాలని,కంటైనర్లను సైతం తనిఖీ చేయాల్సి వుంటుందని. విధి నిర్వహణ లో చెక్‌పోస్ట్ సిబ్బంది అలస త్వం వహిస్తే సహించేది లేదని పోలీస్ కమిషనర్ హెచ్చరిం చారు. పోలీస్ కమిషనర్ వెంట ఆత్మకూర్ ఇన్స్‌స్పెక్టర్ సంతోష్ వున్నారు.

# పుస్తక పఠనంతోనే విజ్ఞాన శిఖరాలకు చేరవచ్చు

- మొబైల్ వినియోగం తగ్గించి గ్రంథాలయాలకు రావాలి.
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మే : 15 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 'లైబ్రరీ డే' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, గ్రంథాలయాలను ఎక్కువగా సందర్శించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు జ్ఞానానికి హృదయ స్పందన వంటివని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇవి బలమైన పునాది వేస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. "విద్య పేదవారి తలరాతను, రాష్ట్ర భవిష్యత్తును మారు



స్తుందనే నినాదాన్ని గుర్తు చేస్తూ, ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని నిత్య అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న అపారమైన జ్ఞాన సంపదను వినియోగించుకుని సమాజంలో గొప్ప నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలు, బుక్ టాక్స్ పఠన కార్యక్రమాలు విద్యార్థులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రంథాలయాన్ని చురుగ్గా వినియోగిస్తూ నిరంతరం పఠనంలో పాల్గొంటున్న ఉత్తమ పాఠకులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, వారికి పుస్తకాలను బహుకరించారు. జిల్లాలో పఠన సంస్కృతిని మరింత బలోపేతం చేయడానికి కమ్యూనిటీ రీడింగ్ డ్రైవ్, పుస్తక విరాళాల సేకరణ వంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చివరగా, "నేడు చదవండి -- రేపు నాయకులుగా ఎదగండి" అనే స్ఫూర్తిదాయక సందేశంతో విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా అన్‌లోడ్ చేయాలి

- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్.

**జగిత్యాల: మే 15(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లాలోని వరి కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వస్తున్న వరి ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా అన్‌లోడ్ చేసిన వెంటనే లారీలను త్వరితగతిన పంపించాలని మిల్లర్లను ఆదేశించారు ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ధర్మపురి మండలం, జైన, రాజారాం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, దుబ్బల గూడెం గ్రామంలో మొక్కజొన్న గోదాం అలాగే దమ్మన్న పేట గ్రామంలోని పరమేశ్వర రైస్ మిల్, ధనలక్ష్మి రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు



ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు, టార్పలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. రైతులు, రవాణాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం దిగుమతి, నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. మిల్లుల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం, మిల్లింగ్ సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిల్లర్లు హమాలీలను అందుబాటులో ఉంచుకొని వచ్చిన ధాన్యాన్ని దింపుకోవాలని అలాగే మిల్లర్లు, ట్రాన్స్పోర్టర్లు, అధికారులు సమన్వయం చేసుకొని కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ , సివిల్ సప్లైస్ డిఎం జితేంద్ర ప్రసాద్ , తహసీల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం ఇబ్బందులకు చెక్

### ప్రతి ఇంటికి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసిన సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి

**తల్లాడ, మే 15 (తెలంగాణ వాణి)**
స్థానిక మేజర్ గ్రామపంచాయతీ ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఇంటికి ప్రతి వీధికి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం తల్లాడ పంచాయతీలో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా ప్రతి వీధికి తరలిస్తూ ప్రజలకు నీటిని అందిస్తున్నారు. ఈ సందర్భంగా






వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు రాకపోయినప్పటికీ పంచాయతీలో మూడు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఇంటికి నీరు వస్తాయని ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. వేసవికాలం నేపథ్యంలో నీటి కొరత ఉందని, ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఈవో శ్రీహరికృష్ణ, గ్రామ పంచాయతీ వర్కర్లు సురేందర్ రెడ్డి, చాంద్, మహంకాళీ కృష్ణ, చలిగంజి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలాజీ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభించిన ఖానాపూర్ ఎమ్మెల్యే



**ఉట్నూర్ మే :14 (తెలంగాణ వాణి )**

ఉట్నూర్ మండల కేంద్రంలో బాలాజీ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభించిన నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ .టెంకాయ కొట్టి రిబ్బన్ కట్ చేశారు .యజమాని వంశీ కి శుభాకాంక్షలు తెలిపారు.ఏజెన్సీ ప్రాంతంలో అన్ని సౌకర్యాలతో డయాగ్నొస్టిక్ సెంటర్ లు ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. ఉట్నూర్ పరిసర ప్రాంత ప్రజలకు ఆరోగ్య పరీక్షల చేసుకోవడానికి సులువుగా ఉండేందుకు ఇలాంటి ల్యాబ్స్ ఏర్పాటు చేయడం ఉపయోగకరం అన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మరియు జిల్లా ఉపాధ్యక్షులు జిల్లపెల్లి చంద్రయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బల్ టీపీసీసీ చైర్మన్ ఎ.స్పీ రెడ్డి ,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికుడు పింగళి శ్రీను కుటుంబానికి అండగా తోటి కార్మికులు



**వైరా, మే 15 (తెలంగాణ వాణి):**

స్థానిక వైరా మున్సిపాలిటీలో 10వ వార్డులో 15 న మిషన్ భగీరథ కార్మికుడు పింగళి శ్రీను అకాల మరణం చెందడం జరిగింది. వారి కుటుంబానికి మిషన్ భగీరథ కార్మికులు అండగా ఉండి ఒక క్వింటా బియ్యం 15200 రూపాయలు ఆర్థిక సహాయం పింగళి శీను, భార్య రాధా కి శుక్రవారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాలిటీ పదో వార్డ్ కౌన్సిలర్ కిన్నెర కృష్ణయ్య, గ్రామ పెద్దలు పూర్ణ గంటి దాసు, కిన్నెర నారాయణ, పింగళి రామారావు, వైరా సబ్ డివిజన్ అధ్యక్షులు పర్స రవి, కందుల అర్జున్ రావు, పాపగంటి రాంబాబు,అనుబోతు బాలకృష్ణ, చిత్తారు రాజబాబు,కొపూరి నాగేశ్వరరావు, ఏదునూరు సురేష్, మరస్కట్ల రవి, తగరం శ్రీకాంత్, మొదలుగా కార్మిక సోదరులు పాల్గొనడం జరిగింది.

## ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు

### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, మే 15, (తెలంగాణ వాణి రిపోర్టర్):**

నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల లోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరం గూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట లో గల లేక్ వ్యూ కాలనీలో శుక్రవారం రక్షిత మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన పక్షంలో నూతన బోర్లు, ట్యాంకర్లు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, జలమండలి జిఎం శ్రీనివాస్ రెడ్డి, డిజిఎం శివ, ఇంజనీరింగ్ డిఈ వెంకటరమణ, కాలనీ అధ్యక్షుడు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో రీడింగ్ రూమ్ ప్రారంభించిన ప్రిన్సిపల్



**ధర్మారం :మే 15 (తెలంగాణ వాణి ప్రతినిధి )**

ధర్మారం మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో మండల యువత, విద్యార్థినీ విద్యార్థుల కొరకు రీడింగ్ రూమ్ ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభించినట్లు స్థానిక ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ విద్య వారోత్సవాల సందర్భంగా పాఠశాలకు సంబంధించిన విద్యార్థులతో పాటు ధర్మారం,ఎండపల్లి మండలాల తో పాటు ఇతరత్రా నిరుద్యోగ అభ్యర్థులకు యువతకు ఉపయోగపడే విధంగా అన్ని రకాల వసతులతో కూడిన రీడింగ్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల విద్యార్థుల విద్యకు సంబంధించిన పుస్తకాలు పోటీ పరీక్షల కొరకు సమర్థమవుతున్న అభ్యర్థుల కొరకు పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచామని ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అందరికీ అందుబాటులో ఈ రీడింగ్ రూమ్ ఉంటుందన్నారు. విద్యార్థులు నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియం చేసుకోవాలని ప్రిన్సిపల్ రాజకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

- రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు
- జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల:మే 15(తెలంగాణ వాణి ప్రతినిధి)**

రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు భద్రంగా కొనసాగేందుకు, పశువుల అక్రమ రవాణా, గోవధ నివారణ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన రాయపట్నం, రాజారాం పల్లె, చిల్వకోడూర్ చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.



జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువులను తరలిస్తున్న వాహనాల పత్రాలను పూర్తిగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని ,అనుమానాస్పదంగా సంచరించే వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.అక్రమంగా గోవులను రవాణా చేస్తున్నారనే పేరుతో కొందరు వ్యక్తులు లేదా సంఘాలు బృందాలుగా ఏర్పడి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని, ఎవరూ స్వచ్ఛందంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని అన్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించబోమని, ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు.ఎస్పి వెంట డిఎస్పి పురుషోత్తం రెడ్డి, ధర్మపురి సి.ఐ రామ్ నరసింహ రెడ్డి, ఎస్. ఐ లు మహేశ్, ఉదయ్ కుమార్, కృష్ణ సాగర్, సిబ్బంది ఉన్నారు.

# సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

**ధర్మారం: ఫిబ్రవరి 15 (తెలంగాణ వాణి )**

కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లా, మరియు వ్యవసాయ శాఖ ధర్మారం ఆధ్వర్యంలో శుక్రవారం మండలం లోని బొట్ల వనపర్తి గ్రామంలో సంయుక్తంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సమతుల్య ఎరువుల వినియోగం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు స్థూల పోషకాలయిన నత్రజని, బాస్వరం, ఫొటాస్ వినియోగంపై వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ అవగాహన కల్పించారు. ముఖ్యంగా వరిలో ఏ దశలో నత్రజని, భాస్వరం మరియు ఫొటోస్ లను వాడాలో వాటి ప్రాముఖ్యతని వివరించారు. పచ్చి రొట్ట ఎరువులయిన జనుము, జీలుగా లను రైతులు తప్పనిసరిగా వేస్తూ పొలంలో కలియదున్నాలని అదేవిధంగా సేంద్రియ ఎరువుల వాడకంలో పంట క్షేత్రంలో పెంచుకోవాలని సూచించారు. భూసార పరీక్ష యొక్క ప్రాముఖ్యతను సేకరణ విధానంలో రైతులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో పెద్దపల్లి జిల్లా రైతు సోదరులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తూ దానికి సంబంధించిన భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. దీంతోపాటు ఆయిల్ ఫామ్ లో యాజమాన్య పద్ధతులు, వరి కోయలను కాల్చకుండా నేలలో కలియదున్నాలని డాక్టర్ కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంఘ రమేష్, ఉప సర్పంచ్, వ్యవసాయ విస్తీరణ అధికారి సుష్మ, రైతులు పాల్గొన్నారు.



# విశ్రాంత ఉద్యోగులు ఉపాధ్యాయుల ఊటీ యాత్రకు గూడెం అర్థిక సహకారం

**పటాన్ చెరు, మే 15, (తెలంగాణ వాణి రిపోర్టర్):**

రామచంద్ర పురం యూనిట్ విశ్రాంత ఉద్యోగులు ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17 వ తేదీ నుంచి వారం రోజుల పాటు సాగే ఊటీ, కూర్గ్, విహార యాత్రల కు స్థానిక శాసన సభ సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి 5 లక్షలు రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. గత నెలలో ఇదే సంఘం సభ్యులు దంపతులతో రుషికేశ్, హరిద్వార్, ఆగ్రా, డెల్లి, అయోధ్య, వారణాశి యాత్రకు సైతం రూపాయలు పది లక్షలు ఆర్థిక సహాయం అందించారు. ఇప్పుడు మరి కొందరు సభ్యులు సింగిల్ గా చల్లదనం కోసం ఊటీ, కూర్గ్, మైసూర్, వెళ్లేందుకు అయిదు లక్షలు రూపాయలు అంద జేశారు. ఈ సందర్భంగా ఎం ఎల్ ఏ దంపతులను ఆయన నివాసంలో సంఘం సభ్యులు శాలువా శుక్రవారం ఉదయం ఘనంగా సత్కరించారు. మొత్తం 39 మంది సభ్యులు ఈ విహార యాత్ర కు వెళుతున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సంఘ బాధ్యులు ప్రతాప్ రెడ్డి, రాములు, బస్వరాజు. అంజయ్య, రామచంద్ర గౌడ్, పోచయ్య మామిల్ల కిషన్, గుండం మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ పోలీసు అకాడమీతో గీతం కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అవగాహనా ఒప్పందం

**పటాన్ చెరు, మే 15, (తెలంగాణ వాణి రిపోర్టర్):**

హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి) శుక్రవారం రాజా బహద్దూర్ వెంకట్ రామిరెడ్డి (ఆర్బీవీఆర్ఆర్) తెలంగాణ పోలీసు అకాడమీతో అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. విద్యా సంస్థలు, చట్ట అమలు సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేస్తూ కుదుర్చుకున్న ఈ ఎంవోయూ పత్రాలను పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ లాంఛనంగా పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు ప్రముఖులు మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యాన్ని స్వాగతించారు. విధాన పరిశోధన, పరిపాలన అధ్యయనాలు, నాయకత్వ అభివృద్ధి, సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహించడంలో పోలీసు శిక్షణా సంస్థలు, విద్యా సంస్థల మధ్య సహకార కార్యక్రమాల ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ప్రజా విధానం, పరిపాలన, నాయకత్వం, చట్ట అమలు పద్ధతులు వంటి కీలక రంగాలలో జ్ఞాన మార్పిడిని



సులభతరం చేయడం, సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ భాగస్వామ్యం యొక్క లక్ష్యం. ఈ సహకారంలో భాగంగా, రెండు సంస్థలు కలిసి పోలీసు అధికారులు, సిబ్బంది కోసం శిక్షణా కార్యక్రమాలు, కార్యశాలలు, చర్చాగోష్ఠులు, సమావేశాలను నిర్వహిస్తాయి. పోలీసు అకాడమీలోని శిక్షణా కార్యక్రమాలకు కె.ఎస్.పి.పి. అధ్యాపకులు తమ విద్యా నైపుణ్యాన్ని అందిస్తారు. అదే సమయంలో ఈ అవగాహన ఒప్పందం అధ్యాపకులు, నిపుణులు, వనరుల వ్యక్తుల మార్పిడికి కూడా వీలు కల్పిస్తుంది. ఈ సహకారం సైబర్ చట్టం, సైబర్ భద్రత, మానవ హక్కులు, రాజ్యాంగ చట్టం, ప్రజా విధానం, పరిపాలన, నాయకత్వం, నిర్వహణ వంటి కీలక రంగాలపై దృష్టి సారిస్తుంది. ఈ చొరవ, వృత్తిపరమైన విద్యను బలోపేతం చేయడానికి, సమకాలీన పరిపాలన, పోలీసింగ్ సవాళ్లకు అంతర్-విషయ విధానాలను ప్రోత్సహించడానికి ఉన్న ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. తొలుత, తెలంగాణ పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్-సర్వీస్) జి.కవిత స్వాగతోపన్యాసం చేస్తూ, వృత్తి విద్యాభ్యాసం, ప్రజా విధాన భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో సంస్థాగత భాగస్వామ్యాల ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు. తెలంగాణ పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ (ఓడీ) పి. శ్రీరామమూర్తి వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమానికి కె.ఎస్.పి.పి. తరఫున జనరల్ మేనేజర్ (ప్రోగ్రామ్స్) శివాంగి శర్మ, ప్రోగ్రామ్స్ మేనేజర్ (ఎంపీపీ) శివాంగి పాండే తదితరులు హాజరయ్యారు.




## మదర్ డెయిరీకి పూర్వ వైభవం తీసుక వద్దాం

### సంధిల భాస్కర్ గౌడ్:

**రాజపేట మే: 14(తెలంగాణ వాణి విలేకరి) మదర్**

డైరీ రంగంలో విప్లవత్మకమైన మార్పులు తీసుకొచ్చి క్షీర విప్లవం వైపు అడుగులు వేసుకుంటూ మదర్ డైరీ కి పూర్వైవం తీసుకొద్దామని డైరీ డైరెక్టర్లు సందిల భాస్కర్ గౌడ్, గొల్లపల్లి రాంరెడ్డి లు అన్నారు. శుక్రవారం రాజాపేట లో పాలశీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే మదర్ డైరీ లక్ష్యమని తెలిపారు. మూడు నెలలకు సంబంధించిన ఆరు బిల్లులను రైతులకు అందజేశారు. ప్రైవేట్ డైరీ లను నమ్మి మోసపోవద్దని అన్నారు. సరైన పోషణతో అధిక పాల దిగుబడిని సాధించి మదర్ డైరీ అభివృద్ధికి బాటలు వేయాలని పేర్కొన్నారు. నాణ్యమైన పాలు తీసుకొచ్చి అధిక ధరలను పొందాలని సూచించారు. ఎన్ డి డి బి సహకారంతో డైరీ ని ప్రగతి పథంలో నడిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సొసైటీ అధ్యక్షులు ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మిగతా బాకీ ఉన్న బిల్లులను తొందరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ డైరెక్టర్లు ఆర్కాల గాల్ రెడ్డి, చింతలపూరి వెంకట్రాంరెడ్డి, మేనేజర్ మాధవరం శేఖర్, సూపర్వైజర్ దిడ్డిరాములు, వివిధ గ్రామాల చైర్మన్లు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు

### రైతులతో మాట్లాడి సమస్యలు, మార్కెట్ సదుపాయాలపై ఆరా తీసిన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్, మే :15 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**

రైతులు పండించిన జొన్న పంటను త్వరితగతిన కొనుగోలు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంట దిగుబడి, కొనుగోలు ప్రక్రియ, మార్కెట్‌లో కల్పిస్తున్న సదుపాయాలపై రైతులను అడిగి వివరాలు సేకరించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు.జొన్నల కొనుగోలు ప్రక్రియలో గన్ని బ్యాగుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మార్కెట్ యార్డులో రైతుల సౌకర్యార్థం టెంట్లు, చల్లటి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచుతున్నామని, అందులో భాగంగానే కజ్జర్ల, జరి, భీంపూర్ గ్రామాల్లో కొత్త కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం రైతులు మార్కెట్ యార్డుకు జొన్నలను తీసుకువచ్చి అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు,సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.





## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

**సుజాతనగర్ మే 15 : (తెలంగాణ వాణి)**

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియలో భాగంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా,రైతులకు నష్టం కలుగకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖల అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేసింది. ఇందులో భాగంగానే ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా జిల్లాలోని అందరు పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శుక్రవారం నాడు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సుజాతనగర్లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సంబంధిత శాఖల అధికారులతో కలిసి రైతులతో సమావేశమయ్యారు.అక్కడ పాల్గొన్న రైతులు ఎస్పీ గారికి తమ సమస్యల గురించి తెలియజేశారు.అట్టి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా గన్నీ బ్యాగులు,కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు సంబంధించి,ధాన్యాన్ని కప్పి ఉంచడానికి ఉపయోగించే తార్పాలిన్ పట్టాలకు సంభందించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రైతులకు అండగా నిలబడాలని సూచించారు.ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులతో పాటు పోలీసు వారికి కూడా సమాచారం అందించాలని కోరారు.అనంతరం అక్కడ ధాన్యం కొనుగోలు విధానాన్ని,ధాన్యాన్ని గ్రేడింగ్ చేసే విధానాన్ని ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,ఎస్సైలు రమాదేవి,రవి మరియు ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఎస్సీ సెల్ కో-ఆర్డినేటర్‌గా ఆరెపల్లి రాజేందర్ నియామకం

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి.**

**మానకొండూర్:మే 15 (తెలంగాణ వాణి)**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం కో-ఆర్డినేటర్ గా మానకొండూర్ వాసి ఆరెపల్లి రాజేందర్ నియామకమయ్యారు. ఈ మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామక పు ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు వీలుగా పార్టీ కమిటీలను పునర్వ్యవస్థీకరి స్తున్న నేపథ్యంలో పార్టీ కమిటీల ఏర్పాటు,దరఖా స్తుల స్వీకరణ,పార్టీ బలోపే తం వంటి తదితర పనుల పర్యవేక్షణ కోసం రాష్ట్ర కో-ఆర్డినేటర్ ను నియమించి నట్టు డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, మానకొండూర్ గ్రామానికి చెందిన ఆరెపల్లి రాజేందర్ భారత ప్రభుత్వరంగ సంస్థ రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు.ఎన్టీపీసీలో డెప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయి కలిగిన హోదాలో పని చేసి రిటైర్డ్ మెంట్ కు నాలు గేళ్ల ముందుగానే 2018 లో స్వచ్ఛంధ పదవీ విరమణ చేశారు.రాజేందర్ విద్యావేత్త. దళిత ఉద్యమం,తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొన్నా రు.రాజకీయాల్లో క్రియాశీలకం గా ఉంటూ దళితుల ఐక్యత, సామాజిక న్యాయం కోసం రాజేందర్ పాటుపడుతు న్నారు.కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గా నియామకంపై సంతోషం వ్యక్తం చేస్తూ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణకు ఆరెపల్లి రాజేందర్ కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పాటుపడతానని,తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోనని రాజేందర్ స్పష్టం చేశారు.

## అఖిల భారత పోలీస్ క్రీడా పోటీలలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి అద్భుత ప్రతిభ

**టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పతకాల పంట**

**జాతీయ స్థాయిలో కరీంనగర్ పోలీస్ కీర్తిని చాటిన హుజురాబాద్ ఏసీపీ మాధవి**

**కరీంనగర్:మే 15 (తెలంగాణ వాణి ప్రతినిది)**



ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఈనెల 9వ తేదీ నుండి 13వ తేదీ (09.05.2026 నుండి 13.05.2026) వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన “అఖిల భారత పోలీస్ క్రీడా పోటీల”లో కరీంనగర్ జిల్లా హుజూరా బాద్ ఏసీపీ వి.మాధవి అద్భుత ప్రదర్శనతో రాణించి ఘన విజయం సాధించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన గట్టి పోటీని తట్టుకొని,టేబుల్ టెన్నిస్ మరియు బ్యాడ్మింటన్ విభాగాల్లో ఆమె ఏకంగా నాలుగు పతకాలను కైవసం చేసుకుని రాష్ట్ర పోలీస్ శాఖకు,కరీంనగర్ కమిషనరే ట్‌కు తీరని కీర్తిని తెచ్చిపె ట్టారు.?హుజూరాబాద్ ఏసీపీ మాధవి సాధించిన పతకాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి: టేబుల్ టెన్నిస్ విభాగం: జి.ఓ. 50ం విభాగం:మిక్స్డ్ డబుల్స్ పోటీలలో అత్యంత ప్రతిభను కనబరిచి రజత పతకం సాధించారు. జి.ఓ. 40ం విభాగం:మిక్స్డ్ డబుల్స్ పోటీలలో గట్టి పోటీనిచ్చి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. ఎన్.జి.ఓ విభాగం:మిక్స్డ్ డబుల్స్ విభాగంలో రాణించి కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. బ్యాడ్మింటన్ విభాగం: జి.ఓ. 50ం విభాగం:మిక్స్డ్ డబుల్స్ పోటీలలో అద్భుత ఆటతీరుతో కాంస్య పతకం సాధించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఘన అభినందనలు:జాతీయ స్థాయిలో ఒకే క్రీడా పోటీలలో టేబుల్ టెన్నిస్,బ్యాడ్మింటన్ వంటి భిన్నమైన విభాగాల్లో నాలుగు పతకాలు సాధించి, సరికొత్త రికార్డు సృష్టించిన హుజూరాబాద్ ఏసీపీ మాధవి పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం మరియు సహచర అధికారు లు ఘనంగా అభినందిం చారు.విధి నిర్వహణలో ఎంతో బిజీగా ఉంటూనే,క్రీడల పట్ల మక్కువతో కఠోర శ్రమకోర్చి జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అందరికీ ఎంతో స్ఫూర్తిదా యకమని కొనియాడారు.

## బక్రీద్ పండుగ నేపథ్యంలో పోలీస్ చెక్‌పోస్టుల ఏర్పాటు

**తనిఖీలను ముమ్మరం చేసిన కరీంనగర్ సిపి**

**కరీంనగర్: మే 15 (తెలంగాణ వాణి)**

రాబోయే బక్రీద్ పండు గను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ కమిషన రేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ,అక్రమ రవాణా నివారణే ధ్యేయంగా సరిహ ద్దు ప్రాంతాలలో ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచడంతో పాటు విధుల్లో ఉండే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు,భద్రతా పరికరాల ను సమకూర్చుతున్నట్లు పేర్కొన్నారు.ఇందులో భాగంగానే కరీంనగర్ పరిధిలోని మగ్దూంపూర్ చెక్‌పోస్టును సీపీ గురువారం అర్ధరాత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అక్కడ లైట్ రిఫ్లెక్టర్ జాకెట్లు,సరిపడా లైటింగ్ వసతి మినహా మిగిలిన రక్షణ పరికరాల కొరత ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందిస్తూ తనిఖీల లో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా శనివారం నుండి ప్రతి చెక్‌పోస్టు వద్ద అన్ని రకాల వసతులను విధిగా అందుబాటులో



ఉంచాలని సంబంధిత అధికారులను సీపీ ఆదేశిం చారు. ఇకపై ప్రతి చెక్‌పోస్టు వద్ద రాత్రి వేళల్లో తనిఖీల కోసం 3 టార్చ్ లైట్లు,వాహనాలను నిలిపివేసేందుకు మరియు సిబ్బంది రక్షణ కొరకు 3 ఎల్ఈడీ బాటన్లు,అత్యవస ర అలర్ట్‌ల కోసం సిబ్బంది వద్ద విజిల్స్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.వీటితో పాటు చెక్‌పోస్టుల గుండా వెళ్లే ప్రతి వాహనం మరియు వ్యక్తుల కదలికలను నిరంతరం రికార్డ్ చేసేందుకు వీలుగా 2 సీసీటీవీ కెమెరాలను తక్షణమే ఏర్పా టు చేసి పక్కా నిఘా ఉంచా లని ఆదేశించారు.రాత్రి వేళల్లో సిబ్బంది సుదూర ప్రాంతాల వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా తగిన న్ని లైట్ రిఫ్లెక్టర్ జాకెట్లను ధరించాలని,అత్యవసర సమాచార మార్పిడి కోసం ప్రత్యేక కమ్యూనికేషన్ బేస్ సెట్లను ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు.అలాగే చెక్ పోస్టుల మీదుగా రాకపోకలు సాగించే అనుమానాస్పద వాహనాల వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా రిజిస్టర్లను నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, చట్టవిరుద్ధమైన రవాణాకు అడ్డుకట్ట వేసేందు కే ఈ తనిఖీలను ముమ్మరం చేసినట్లు సీపీ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. పండుగను ప్రశాంత వాతావర ణంలో జరుపుకోవాలని, ప్రజలు,వాహనదారులు చెక్‌పోస్టుల వద్ద విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

## జిల్లా అదనపు కలెక్టర్, సంక్షేమ అధికారిని కలిసిన “ఉదయ్” కమిటీ సభ్యులు

**–సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కు వినతి**

**భువనగిరి మే: 15(తెలంగాణ వాణి విలేకరి)**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని వికలాంగులకు ఉద్యోగ రిజర్వేషన్లు హక్కులు, రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావు లను వేరు వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలని, ప్రైవేటు సంస్థల సీ ఎస్ ఆర్ ( కార్పోరల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులను దివ్యాంగుల



స్వయం ఉపాధికి ఉపయోగించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ/ప్రైవేటు భవనాల ప్రధాన ద్వారం వద్ద ర్యాంపులు/లిఫ్టులు ఏర్పాటు చేయాలని దివ్యాంగుల కొరకు ప్రతి వారం ప్రత్యేక ప్రజావాణి ( గ్రీవెన్స్ డే) నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు, కుమార్ మల్లు, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ అంజి గౌడ్, హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా నూతన అధ్యక్షులు జి. స్వామి, ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్స్ ఏ. గోపాల్, ఆర్ వెంకటేష్, కోశాధికారి సత్యనారాయణ, కార్యవర్గం సభ్యులు మహేష్, రాజేష్, వెంకటేష్, మల్లారెడ్డి, సిద్ధార్థ్ నాయక్, సీ.హెచ్ శివ, సాయి కుమార్, బాలరాజు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచిన బీజేపీ ప్రభుత్వం

- **దేశ ప్రజలను మోసం చేసింది.**
- **మంత్రి పొన్నం ప్రభాకర్.**

**హుస్నాబాద్ మే 15 (తెలంగాణ వాణి ఆర్ సి)**

దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారని, దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు పూర్తికాగానే ముఖ్య మంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని, కిషన్ రెడ్డి ,బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారని,ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని,గతంలో యూపిఎ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రి గా ఉన్న నరేంద్ర మోదీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని, మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటన లో పెట్రోల్ ,డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే అనుమానం వచ్చింది నడ్డి విరవపోతున్నారని అన్నారు.ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు,యుద్ధం కారణంచూపు తున్నారు. యుద్ధం ఈరోజు రాలేదని ఎప్పటినుండోఉందని ,పెట్రోల్,డీజిల్ ధరల పై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు.పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు



స్పందించి ముక్కు నేలకు రాయాలని అన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- **పెంచిన పెట్రోల్ డీజిల్ వెంటనే ధరలు తగ్గించాలి.**
- **బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి.**

**హుస్నాబాద్ మే 15 (తెలంగాణ వాణి ఆర్ సి)**

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేద ప్రజలకు అధిక భారం మోపిందని,ఒకే సారి మూడు రూపాయలకు పై గా పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచినట్లు చేసిందని బిఆర్ఎస్ పార్టీ నియోజక వర్గం అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. వారు మాట్లాడుతూ గతం లోనే పెట్రోల్,డీజిల్ పై అధిక రేట్లు ఉన్నాయని, అవే భారంగా ఉన్నాయంటే ఇప్పుడు మరింత ధరలు పెరుగడం వలన నిత్యవసర వస్తువులు పెరుగు దలకు ప్రభావం పడుతుందని,వ్యవసాయ కోతల సీజన్ నడుస్తుం దని, అందువలన రైతులపై భారం పడుతుందని,పశ్చిమ ఆసియా దేశాల లో యుద్ధాల నేపథ్యంలో ధరలు పెరుగుతాయని ప్రజల్లో




ప్రచారం ఉందని,అది నిజం అయిందని,మాది ప్రజల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే బి జె పి పార్టీ ఇప్పుడు ఎందుకు ధరల మీద ధరలు పెంచి ప్రజా వ్యతిరేఖ విధానలు అవలంభి స్తుందని ప్రశ్నించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తి కాగానే మూడు రోజుల్లోనే పెట్రోల్ డీజిల్ ధరలు పెంచినారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పొదుపు సూత్రాలు పాటించాలని ప్రచారం చేస్తూ బి జె పి ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేసేది చేస్తుందని, ప్రజలను మభ్యపెట్టెందుకే మాట్లాడుతునట్లు కనపడుతుందని అన్నారు.ఇప్పటి కైనా కేంద్రం ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ రేట్లపై ఆలోచన చేసి ప్రజలపై అధిక భారం పడకుండా పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.లేకుంటే రానున్న రోజుల్లో తప్పకుండా బి జె పి ప్రభుత్వనికి తగిన తీర్పు ప్రజలు చెప్పుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సూరం పర్శరాములు, యాస శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తోటపల్లిలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం

**హుస్నాబాద్: మే 15తెలంగాణ వాణి రూరల్**

గ్రామాల్లో భద్రతను పటిష్టం చేయడంలోనూ, నేరాల నియంత్రణలోనూ సీసీ కెమెరాలు ‘మూడో కన్ను’లా పనిచేస్తాయని హుస్నాబాద్ ఏసీపీ ఎస్. సదానందం పేర్కొన్నారు.సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం తోటపల్లిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ బంక లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.సిద్దిపేట సీపీ రశ్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి గ్రామంలో భద్రత నిమిత్తం సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని, నేర పరిశోధనలో సీసీ ఫుటేజీలు అత్యంత కీలకమైన ఆధారాలని ఆయన గుర్తుచేశారు.యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని ఏసీపీ సూచించారు.




ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోవద్దని, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనల విషయంలో అజాగ్రత్త వద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు వాహన పత్రాలు వెంట ఉంచుకోవాల న్నారు.మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారకులు కావద్దని హెచ్చరించారు.గ్రామ సర్పంచ్ బంక లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలోని నాలుగు ప్రధాన కూడళ్లలో కెమెరాలు ఏర్పాటు చేశామని, నేటి నుంచి తోటపల్లి నిఘా నీడలోకి వచ్చిందని తెలిపారు.కెమెరాల ఏర్పాటుకు సహకరించిన యాదవ సంఘం, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్సై పి. లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బంక చందు, గ్రామ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యులు మానుక కుమార్, శాతవేణి అనూష, బొంగుని రేణుక, గూళ్ల ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## మదర్ డెయిరీకి పూర్వ వైభవం తీసుక వద్దాం

### సంధిల భాస్కర్ గౌడ్

**రాజపేట మే: 15(తెలంగాణ వాణి విలేకరి)**

మదర్‌డైరీ రంగంలో విప్లవత్మకమైన మార్పులు తీసుకొచ్చి క్షీర విప్లవం వైపు అడుగులు వేసుకుంటూ మదర్ డైరీ కి పూర్వైవం తీసుకొద్దామని డైరీ డైరెక్టర్లు సందిల భాస్కర్ గౌడ్, గొల్లపల్లి రాంరెడ్డి లు అన్నారు. శుక్రవారం రాజాపేట లో పాలశీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే మదర్ డైరీ లక్ష్యమని తెలిపారు. మూడు నెలలకు సంబంధించిన ఆరు బిల్లులను రైతులకు అందజేశారు. ప్రైవేట్ డైరీ లను నమ్మి మోసపోవద్దని అన్నారు. సరైన పోషణతో అధిక పాల దిగుబడిని సాధించి మదర్ డైరీ అభివృద్ధికి బాటలు వేయాలని పేర్కొన్నారు. నాణ్యమైన పాలు తీసుకొచ్చి అధిక ధరలను పొందాలని సూచించారు. ఎన్ డి డి బి సహకారంతో డైరీ ని ప్రగతి పథంలో నడిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సొసైటీ అధ్యక్షులు ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మిగతా బాకీ ఉన్న బిల్లులను తొందరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ డైరెక్టర్లు ఆర్కాల గాల్ రెడ్డి, చింతలపూరి వెంకట్రాంరెడ్డి, మేనేజర్ మాధవరం శేఖర్, సూపర్వైజర్ దిడ్డిరాములు, వివిధ గ్రామాల చైర్మన్లు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.!

-అదనపు డీసీపీ కుషాల్కర్ -



**కోహెడ :మే 15(తెలంగాణ వాణి విలేకరి)**

సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో శుక్రవారం రోజున గ్రామపంచాయతీ వద్ద వైట్ ఫీల్ట్ బయో ప్రొడక్ట్ ప్రై.లీ. గ్రీన్వేస్ బయో ఎనర్జీ ప్రై.లీ. కంపెనీ వారి సహకారంతో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు డీసీపీ కుషాల్కర్ విచ్చేసి సీసీ కెమెరాల ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ అధునిక సాంకేతికతను కలిగిన సీసీ కెమెరాలను గ్రామంలోని ప్రధాన కూడళ్లు బస్‌స్టేషన్, గ్రామం ఎంట్రీ ఎగ్జిట్‌లలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గంలోని సిద్దిపేట జిల్లా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి నిషేధిత గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా నియంత్రించేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని,గ్రామాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.యువత అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని అన్నారు.వారిని సక్రమమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలకు,బాలికలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే డయల్ 100, షీటీమ్‌కు సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని,నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యత చాలా కీలకంగా మారుతుందని చెప్పారు. అనుమనాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. గ్రామంలోని సీసీ కెమెరాలను ఏర్పాటుకు సహకరించిన వైట్ ఫీల్ట్ బయో ప్రొడక్ట్ ప్రై.లీ. గ్రీన్వేస్ బయో ఎనర్జీ ప్రై.లీ. కంపెనీ వారినిఅభినందించారు.ఈ సీసీ కెమెరా ఏర్పాటులో మండల,గ్రామాల్లో ప్రజలు, వ్యాపారులు,యువత సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సిఐ శ్రీనువాస్,కోహెడ ఎస్ఐ అభిలాష్,గ్రామ సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య,ఉప సర్పంచ్ పెరుక బుచ్చయ్య, వార్డు సభ్యులు,సీనియర్ నాయకులు,మహళలు పోలీస్ సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిర్గాపూర్ వైద్య అధికారిణి పై చర్యలు




**సంగారెడ్డి :సిర్గాపూర్, మే 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

సిర్గాపూర్ మండల కేంద్రమైన పీహెచ్సీ వైద్యాధికారిణి ప్రతిభపై చర్యలు తీసుకుంటూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంత్ రావ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్యాధి కారిణి ప్రతిభ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఇటీవల స్థానికులు నారాయణ్ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహా రతికి ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యాధికారిణిపై ప్రత్యేక అధికారుల బృందం విచారణ జరిపి నివేదిక అందజేశారు. సబ్ కలెక్టర్ సూచన మేరకు వైద్యాధి కారిణి ప్రతిభను డైరెక్టర్ వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు సరెండర్ చేస్తూ డీహెచ్ ఉత్తర్వులిచ్చారు.

## దొంగల బీభత్సం

### నూట పదమూడు (113)తులాల బంగారం, రెండున్నర కిలోల వెండి చోరీ

**పటాన్ చెరు (పెద్ద శంకరంపేట). మే 15, (తెలంగాణ వాణి రిపోర్టర్)**

మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు ఐదు ఇండ్లలో బీభత్సం సృష్టించారు. ఒక్కసారిగా 113 తులాల బంగారం, 2.5 కిలోల వెండి ఎత్తుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వివరాలు పెద్దశంకరంపేట మండలం చీలపల్లి గ్రామ బాధితుల కథనం ప్రకారం... చీలపల్లి గ్రామానికి చెందిన రాయిని రాములు ఇంట్లో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగల గొట్టి రాములు ఇంట్లో 110 తులాల బంగారం, 2.5 కిలోల వెండి, మరో ఇంటి యజమాని ఏసిరెడ్డి మానిక్ రెడ్డి ఇంట్లో 3 తులాల బంగారం అపహరించారు. మరో మూడు ఇండ్లలో కూడా దొంగ తనానికి కూడా యత్నించారు. కానీ ఆ ఇంట్లో ఏమి పోలేదు చీలపల్లి గ్రామానికి చెందిన రాయిని రాములు, భార్య స్వరూప కు ముగ్గురు కుమారులు, కోడళ్లు ఉన్నారు. తన ఇంటికి తాళం వేసి కామారెడ్డి జిల్లా బాన్సువాడ లో తన పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లామన్నారు. శుక్రవారం ఉదయం ఇంటి పనిమనిషి ఇంటికి వెళ్లగా తాళాలు పగల గొట్టి ఉండటంతో రాయిని రాములు కు సమాచారం ఇవ్వడంతో ఆయన హుటా హుటీనా ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వెళ్లి చూడగా బీరువాలు పగలగొట్టి 110 తులాల బంగారం 2.5 కిలోల వెండి గుర్తు తెలియని దుండగులు దొంగలించారని గుర్తించారు. సమీపంలో ఉన్న మరో ఇంట్లో సైతం మూడు తులాల బంగారం దొంగలించినట్లు బాధితుడు ఏసిరెడ్డి మాణిక్య రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, మెదక్ డి.ఎస్.పి ప్రసన్నకుమార్, క్రైం సీఐ రాజశేఖర్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పేట, అల్లాదుర్గం ఎస్ఐ లు ప్రవీణ్ రెడ్డి, శంకర్ లు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సెకరించారు. రాయిని రాములు ఇంట్లో మెదక్ జిల్లా ఎస్ పీ శ్రీనివాసరావు ఇంటి పరిసర ప్రాంతాలను. పగలగొట్టిన బీరువాను పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్కాడ్ చీలపల్లి గ్రామానికి చేరుకొని దొంగతనం జరిగిన సంఘటనా స్థలంలో పరిశీంచారు. ఎస్పీ శ్రీనివాసరావు ఈ దొంగ తనాన్ని త్వరితగతిన చేదించి దొంగలను పట్టుకుంటామన్నారు. చీలపల్లి గ్రామానికి చెందిన రాయిని రాములు, మాణిక్య రెడ్డి, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మాజీ మంత్రి రాజేశం గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ రమణ



**జగిత్యాల: మే 15(తెలంగాణ వాణి ప్రతినిధి)**

రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మాజీ మంత్రి రాజేశం గౌడ్ మోకాలు మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, తెలంగాణ ఉద్యమ నాయకురాలు కదిరే పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాల ద్వారానే పేదల సమస్యలు పరిష్కారం

- పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం సాగించాలి
- సభ్యత్వ నమోదు ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి
- గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలి
- పజల పక్షాన నిలబడి నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమే
- భవిష్యత్ కార్యాచరణకు అనుగుణంగా ఉద్యమాలను ఉధృతం చేయాలి
- కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా





**జూలూరుపాడు/అన్నపురెడ్డిపల్లి (తెలంగాణ వాణి)**

ప్రజా పోరాటాల ద్వారానే పేదల సమస్యలు పరిష్కారమవుతాయని, ఆ దిశగా పార్టీ శ్రేణులు నిరంతరం శ్రమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి మండల కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ప్రజల పక్షాన ఉండి పోరాటాలు నిర్వహించడంలో సిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను అత్యంత త్వరితగతిన పూర్తి చేసి, గ్రామ కమిటీలను బలోపేతం చేయాలని నిర్దేశించారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరిన్ని ఉద్యమాలు చేపడతామని, కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలని ఆయన కోరారు. సమావేశాల్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, జూలూరుపాడు మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్ రావు, చంద్రుగొండ మండల కార్యార్శి బొర్రా కేశవరావు, అన్నపురెడ్డిపల్లి మండల కార్యదర్శి ఊకే నారాయణ, జిల్లా సమితి సభ్యులు నాగుల్ మీరా, జడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అప్రమత్తతతో విపత్కర సమయాల్లో నష్ట నివారణ

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



**నిర్మల్, మే:15(తెలంగాణ వాణి ప్రతినిధి)**

ముందస్తు అప్రమత్తత ద్వారానే విపత్కర సమయాల్లో నష్టపోకుండా ఉండగలుగుతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. భవిష్యత్తులో వచ్చే విపత్తులను ఎదుర్కునేందుకు సన్నద్ధతపై నిర్వహించనున్న మార్క్ ఎక్సర్సైజ్ వివరాలను హైదరాబాద్ నుండి కేంద్ర పర్యావరణ విపత్తు సంస్థ మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ డైరెక్టర్ నుండి మేజర్ జనరల్ సుధీర్ బేహాల్, ప్రిన్సిపల్ సెక్రటరీ రెవెన్యూ హరిచందన దాసరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 18వ తేదీన, వై ఎస్ ఆర్ కాలనీలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేలా మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు అంతా భాగస్వామ్యం అవ్వాలని అన్నారు. ఇటువంటి ముందస్తు సన్నద్ధత ద్వారా ప్రజల్లో విపత్కర పరిస్థితుల సమయాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అవగాహన ఏర్పడుతుందని అన్నారు. ముందస్తు చర్యల వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా కాపాడుకోగలుగుతామని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, సిపిఓ జీవరత్నం, డిఎంహెచ్ఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫేస్‌బుక్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

**నాగర్‌కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి**




**నాగర్ కర్నూల్, మే 15 (తెలంగాణ వాణి)**

365 రోజులు 365 కార్యక్రమాలలో భాగంగా 134 వ రోజు నాగర్కర్నూల్ పోలీస్ స్టేషన్ లో క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఫేస్ బుక్ ఫౌండర్ మార్క్ జుకర్ బర్గ్ జన్మదినం సందర్భంగా ఫేస్ బుక్ అవగాహన కార్యక్రమంలో సీఐ అశోక్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఫేస్‌బుక్‌ను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని , ఫేస్‌బుక్ ద్వారా సమాచారం పంచుకునే ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని తెలిపారు. తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు షేర్ చేయడం వల్ల చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు వంటి గోప్యమైన సమాచారాన్ని సోషల్ మీడియాలో లేదా అనుమానాస్పద లింకుల ద్వారా ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. ఫేస్‌బుక్‌లో తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించే ముందు జాగ్రత్తగా పరిశీలించాలని, నకిలీ ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని కోరారు.యువత ముఖ్యంగా సోషల్ మీడియా వినియోగానికి పరిమితులు పెట్టుకోవాలని, చదువు మరియు వ్యక్తిగత జీవితంపై ప్రతికూల ప్రభావం పడకుండా చూసుకోవాలని సూచించారు. ఫేస్‌బుక్‌లో అసభ్యకర పోస్టులు, ద్వేషపూరిత వ్యాఖ్యలు, ఇతరులను అవమానించే కంటెంట్ పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాలు లేదా సోషల్ మీడియా మోసాలకు గురైన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎస్సై గోవర్ధన్ క్లాస్‌మేట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్, క్లాస్‌మేట్ క్లబ్ ప్రతినిధులు పోల శ్రీనివాసులు, రమణ, పాండు, ఏఎస్సై లు రామకృష్ణ నిరంజన్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ అంజన్న పలువురు పోలీసులు, పాల్గొన్నారు.

## కస్తూరిబా బాలికల పాఠశాలలో అదనపు గదుల ప్రారంభోత్సవం

**ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**డిండి మే 15( తెలంగాణ వాణి ప్రతినిధి )**

డిండి మండల కేంద్రంలో ని కస్తూర్బా బాలికల పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవాన్ని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మరియు నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## తోటి స్నేహితునికి ఆర్థిక సహాయం అందచేత



**డిండి మే 15( తెలంగాణ వాణి ప్రతినిధి )**

డిండి మండల కేంద్రంలో వారం రోజుల వ్యవదిలోనే తల్లి తండ్రులను కోల్పోయిన డిండి గ్రామానికి చెందిన తమ తోటి స్నేహితుడు కూరాకుల రేణయ్యకు గుండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2011-12 బ్యాచ్ కు చెందిన బాల్య స్నేహితులు కుటుంబ సభ్యులను పరామర్శించి 22000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు పాల్గొనడం జరిగింది.

## రజక కార్పొరేషన్ చైర్మన్ మహిళా కమిషన్ సభ్యులను అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన రజక సంఘం నాయకులు



**జూలూరుపాడు: మే 15 ( తెలంగాణ వాణి ప్రతినిధి ):**

మండల పరిధిలోని పాపకొల్లు గ్రామంలో ఈరోజు రజక సంఘం నాయకులు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రజక కార్పొరేషన్ చైర్మన్ మహిళా కమిషన్ సభ్యులుగా అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ,నాయకులకు, ధన్యవాదాలు తెలిపిన జూలూరుపాడు మండలం లో ఉన్న ప్రతి గ్రామపంచాయతీలలో రజక సంఘం నాయకులు. ఈ సందర్భంగా రజక సంఘ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రజక కులస్తులను గుర్తించి తెలంగాణ రజక కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గా దాసరి రాజు అజయ్ కుమార్ మరియు మహిళా కమిషన్ సభ్యురాలుగా చిట్యాల సీత ఐలమ్మ ఎన్నుకోవడం సంతోషకరమని తెలిపారు. అలాగే చాకలి ఐలమ్మ వారసురాలని ,కొందరు కాదని, అనటం హాస్యస్పందనమన్నారు కొందరు అపోహలు పడొద్దు అని తెలిపారు పదవుల కేటాయించినందుకు రజక సంఘం తరఫున కృతజ్ఞతలు కలిపినట్టు రజక కులస్తులకు మంత్రి పదవి కూడా ఇచ్చే ప్రయత్నం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడం వీరభద్రం, గడిపల్లి శ్రీను, ముత్తయ్య, ధర్మరాజుల సత్యనారాయణ ,నిమ్మటూరి రామయ్య ,కనకయ్య ,అనంతరామయ్య ,గ్రామస్తులు తదితరులు కుల నాయకులు పాల్గొన్నారు.

## ఐఎన్టియుసి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**నకిరేకల్ : మే15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

నకిరేకల్ పట్టణం సబ్ స్టేషన్ లో నిర్వహించిన ఐఎన్టియుసి 327 జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ వేముల వీరేశం పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ' విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొచ్చాం. నకిరేకల్ నియోజకవర్గం లో రూ. 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నాం. సాగునీటి పారుదల , విద్య , వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నాం అని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, మే 15 (తెలంగాణ వాణి)**

జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ...రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు అందించేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం 15-05-2026 నుండి 15-06-2026 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేసుకుని రెడ్ క్రాస్ సేవలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల శ్రీనివాస్, సంబంధిత అధికారులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్ ని సన్మానించిన ఎంపీడీవో గణేష్.




**ఇబ్రహీంపట్నం మే 15 (తెలంగాణ వాణి విలేఖరి)**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లో ప్రభుత్వ జూనియర్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సంజీవ్ ని ఎంపీడీవో సిహెచ్ గణేష్ సన్మానించారు.రాష్ట్రములోని ఫలితాల లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి స్థానంలో రావడం జరిగింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డుతో పాటు నగదు బహుమతి వచ్చినందున ప్రిన్సిపల్ సంజీవ్ ను అభినందించారు.ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ,కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇండ్ల గణన ప్రక్రియకు ప్రజలు సహకరించాలి

**అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**వనపర్తి : మే 15, (తెలంగాణ వాణి ప్రతినిధి )**



వనపర్తి జిల్లాలో 2027 జనగణనలో భాగంగా మే 11 నుండి ఇంటింటి గణన కార్యక్రమం ప్రారంభమైందని, ఇందుకోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి, ఖచ్చితమైన సమాచారాన్ని తెలియ జేయాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖీమ్యా నాయక్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ గణనలో భాగంగా ప్రతి ఇంటి పరిస్థితి, ఇంటి నిర్మాణ స్వభావం, గదుల సంఖ్య, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్, వంట ఇంధనం (ఎల్పీజీ, కట్టెలు, విద్యుత్), వాహనాలు, ఇంటర్నెట్ సదుపాయం వంటి వివరాలను సేకరిస్తారని తెలిపారు. అలాగే కుటుంబ సభ్యుల వివరాలు, మొబైల్ ఫోన్లు, టెలివిజన్, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్ తదితర గృహోపకరణాల వివరాలను కూడా నమోదు చేయనున్నట్లు చెప్పారు. మొత్తం 33 ప్రశ్నల ద్వారా ఇంటి వివరాలను సేకరించే ఈ ప్రక్రియలో అధికారులు అడిగే ప్రశ్నలకు ప్రజలు సరైన సమాచారం అందించాలని సూచించారు. జనగణనలో భాగంగా ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రభుత్వ అధికారిక గుర్తింపు కార్డు ఉంటుందని సూచించారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి సమగ్ర సమాచారం అందుబాటులోకి వచ్చి, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.జిల్లా ప్రజలందరూ సహకరించి గణన ప్రక్రియను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ ఇల్లుగృహప్రవేశ కార్యక్రమం



**రాజపేట మే: 15 (తెలంగాణ వాణి విలేకరి)**

రాజపేట మండలం పాముకుంట గ్రామంలో మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు బడే ఉపేంద్రమ్మ నూతన గృహప్రవేశం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకుల సర్పంచులు మండల మహిళా నాయకులు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరై ఉపేంద్రమ్మ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో పార్టీ నాయకుల సమక్షంలో విజయవంతంగా జరిగింది.

## జూన్ 2లోపే ఆరోగ్య కార్డులు ఇవ్వండి: సీఎస్‌ను కోరిన టీజేఏసీ

ఉద్యోగులందరికీ జూన్ 2లోపే ఆరోగ్య కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులతో పాటు సమస్యలను పరిష్కరించాలన్నారు. సీఎం ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలన్నారు. అలాగే జూన్ 2కు ముందే రెండో పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా నగదు రహిత వైద్యం తక్షణమే అందించాలని కోరారు. రెవెన్యూ శాఖలో 61 సంవత్సరాలకు పైబడిన వీఆర్‌ఏల చట్టబద్ధ వారసులైన కుమారులు, కుమార్తెలను నియమించాలన్నారు.

రెవెన్యూ శాఖలో తొలగించిన 632 కంప్యూటర్ ఆపరేటర్లు, ఎఫ్‌టీఎస్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి హామీ కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. రెవెన్యూ శాఖలో ధరణి ఆపరేటర్ల సేవలను కొనసాగించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు హన్మంతరావు, డి.భాస్కర్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, జీపీఓ అసోసియేషన్ అధ్యక్షుడు గరిక ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

## బదిలీల నిషేధం నుంచి మినహాయింపు ఇవ్వండి: జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌కి ట్రెసా వినతి



ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా రాష్ట్ర స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని
ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా రాష్ట్ర స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని
పునరుద్ధరించడం చారిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వంగా రవీందర్ రెడ్డి, కే గౌతమ్ కుమార్‌లు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటుందనని ఆశిస్తున్నామన్నారు. ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటే మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో పని చేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం సచివాలయంలో శుక్రవారం జరిగిన తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ట్రెసా తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు.

రెవెన్యూ శాఖ ఉద్యోగులకు బదిలీల నిషేదం నుంచి మినహాయింపు కల్పించాలని, పలువురు కలెక్టర్లు కూడా ప్రభుత్వానికి ఇదే అంశంపై విన్నవించిన విషయాన్ని గుర్తు చేశారు. 317 జీవో కారణంగా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల పరస్పర బదిలీల దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవడంతో పాటు మరోసారి పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వీఆర్ఏల కారుణ్య నియామకాలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రెగ్యులరైజేషన్ సమయంలో ఇతర జిల్లాలకు బదిలీయైన వీఆర్ఏలను వారి కుటుంబాలకు సమీప ప్రాంతాలకు మార్చి న్యాయం చేయాలని కోరారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి చెల్లించాల్సిన పారితోషిక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్ల విషయంలో ప్రభుత్వం మరోసారి సానుకూలంగా ఆలోచించాలని కోరారు. ఈ సమావేశం ద్వారా ఉద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వస్తోందన్న విశ్వాసం ఉద్యోగుల్లో కలుగుతోందని ట్రెసా నాయకులు అభిప్రాయపడ్డారు.

# పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీలో వరంగల్ ఎంపీ కడియం కావ్యకి చోటు

**తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం.**

**హనుమకొండ మే 15 (తెలంగాణ వాణి టౌన్)**

దేశవ్యాప్తంగా మహిళల హక్కులు, సంక్షేమం, సాధికారతకు సంబంధించిన అంశాలపై కీలక సూచనలు చేసే పార్లమెంటరీ మహిళా సాధికారత స్థాయి కమిటీలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య సభ్యురాలిగా నియమితులయ్యారు. లోక్‌సభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్ఠాత్మక కమిటీకి సీనియర్ పార్లమెంటేరియన్ పురందేశ్వరి అధ్యక్షత వహించను న్నారు. లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన మహిళా ఎంపీలు కమిటీలో సభ్యులుగా కొనసాగనున్నారు.మహిళల భద్రత, విద్య, ఆర్థిక స్వావలంబన, ఉద్యోగావకాశాలు, లింగ సమానత్వం, సామాజిక రక్షణ తదితర అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేయనుంది. మహిళా సాధికారత కోసం అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రభావాన్ని సమీక్షించడంతో పాటు మహిళల ప్రాతినిధ్యం పెంపు, విధానాల సమర్థ అమలు, మహిళా హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలపై కమిటీ ప్రత్యేక దృష్టి సారించనుంది.



వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య కి ఈ కీలక కమిటీలో చోటు దక్కడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. మహిళా సమస్యలపై ఎంపీ కడియం కావ్య కి ఉన్న అవగాహన, సామాజిక అంశాలపై చూపుతున్న చొరవ దృష్ట్యా కమిటీలో ఎంపీ కావ్య సేవలు కీలకంగా ఉండనున్నాయి. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కావ్య మాట్లాడుతూ మహిళల సాధికారత, భద్రత, ఆర్థిక పురోగతికి సంబంధించిన అంశాలను కమిటీలో బలంగా ప్రస్తావిస్తానన్నారు. మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ, ముఖ్యంగా వరంగల్ ప్రాంత మహిళల సమస్యలు, అవసరాలను జాతీయ స్థాయిలో ప్రస్తావించే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా తన వంతు కృషి కొనసాగుతుందని ఎంపీ కావ్య స్పష్టం చేశారు.

# సమాజంలో పోలీసు వ్యవస్థ కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలా విధులను నిర్వర్తించాలి.

- **నేరేడిగొండ పోలీస్ స్టేషన్ లో ప్రహరీ గోడ, వంటగది ప్రారంభం.**
- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ .**

**ఆదిలాబాద్, మే : 15 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**

మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. నేరడిగొండ పోలీస్ స్టేషన్ సందర్శించి సిబ్బంది చేస్తున్న విధులపై, పోలీస్ స్టేషన్లో నమోదవుతున్న కేసుల వివరాలను, కేసుల పరిశోధనపై చేసిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటగా నూతనగా తెలంగాణ స్పెషల్ పోలీస్ వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వంటగదిని మరియు పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీసు కు కేటాయించిన గ్రామాన్ని సందర్శిస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని ఆసాంఘిక కార్యకలాపాలు గంజాయి, గుడుంబా, మట్కా, నిర్వహించకుండా చర్యలు చేపడుతూ, విపిఓ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. ఎలాంటి సమాచారాన్నైనా నేరుగా సంబంధిత పోలీసు అధికారులకు అందించాలని తెలిపారు. సమాజంలో పోలీసు వ్యవస్థకు ఉన్నత స్థానాన్ని కల్పించే విధంగా విధులను నిర్వర్తిస్తూ ఆదిలాబాద్ జిల్లా పోలీసు కీర్తిని పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఉండే ప్రతి ఒక్క సిబ్బందికి సమానమైన విధులను కేటాయించేలా చూడాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. బ్లూ కోర్ట్, డైల్ 100 విధులను ప్రతివారం పర్యవేక్షిస్తూ మండల



పరిధిలో ఎలాంటి మైనర్ డ్రైవింగ్, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. మండలంలో ముఖ్యంగా గంజాయి లేకుండా ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది సమాజ శ్రేయస్సుకై కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. రాత్రిపూట గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఫింగర్ ప్రింట్ పరికరాన్ని ఉపయోగించి అనుమానితుల్ని, నేరస్థులను వేలిముద్రలను సేకరించి పరిశీలించాలని తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సి ఈ ఐ ఆర్ ద్వారా ఫిర్యాదులను నమోదు చేస్తూ బాధితులకు భరోసాని అందించాలని తెలిపారు. ప్రతి ఒక్క సిబ్బంది కష్టపడుతూ నిజాయితీతో విధులను నిర్వర్తించాలని సూచించారు. సిబ్బంది కి ఎలాంటి సమస్యలున్న తెలియజేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న కేసులను త్వరగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టుల నందు చార్జిషీటు దాఖలు చేయాలని సూచించారు.

**బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్పోస్టు తనిఖీ**

బక్రీద్ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడు చెక్పోస్టులు ఏర్పాటు చేయగా అందులో ఐదు అంతర్రాష్ట్ర చెక్ పోస్టు ఉండడం జరిగింది. చెక్ పోస్టులలో ఒకటైన నేరేడుగుండా మండలం రోల్ మామడ చెక్పోస్ట్ ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. అనుమతులు లేకుండా సరైన పత్రాలు లేకుండా ఎలాంటి పశువులను అనుమతించవద్దని ముఖ్యంగా ఆవుల తరలింపు జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. 24 గంటలు అప్రమత్తతతో వ్యవహరించాలని ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి లింగంపల్లి పావని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**దాబా లలో ఆకస్మిక తనిఖీలు**

దాబాలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించడం, విక్రయించడం, గంజాయి, మాదకద్రవ్యాలు ఇలాంటి వాటిని విక్రయించడం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డుపై పార్కింగ్ జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి దాబాలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తరచూ ఆకస్మిక తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడా రూరల్ సీఐ సిహెచ్ రమేష్, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆశన్న పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**మంచిర్యాల,మే 15 (తెలంగాణ వాణి):**

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సమగ్ర శిక్ష, అలింకో సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగాలలో దివ్యాంగుల రిజర్వేషన్లు కల్పించి ప్రోత్సహిస్తుందని,



దివ్యాంగులకు అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల 152 మంది పిల్లలకు వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందించడంలో అలింకో సంస్థ చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రత్యేక అవస రాలు గల పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లల ఉన్నతికి తోడ్పాటు అందించాలని, పిల్లలను అందుబాటులో ఉన్న భవిత కేంద్రానికి పంపించాలని తెలిపారు. ప్రతి శనివారం హోమ్ బేస్డ్ లర్నింగ్, వారానికి రెండుసార్లు ఫిజియోథెరపీ శిబిరాలు ఉంటాయని, దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు కృష్ణమూర్తి, భరత్ కుమార్, జె. సత్తయ్య, దండేపల్లి, జైపూర్ మండల విద్యాధికారులు రాజు, శ్రీనివాస్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి నివారణకు సమిష్టిగా కృషి చేయాలి:జిల్లా కలెక్టర్

**మంచిర్యాల,మే 15 (తెలంగాణ వాణి):**

జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ నెల 16వ తేదీన జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్. అనిత, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, అధికారులతో కలిసి డెంగ్యూ నివారణపై గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నిర్మూలన కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎండాకాలం నుండి వర్షాకాలం ప్రారంభమయ్యే సమయంలో వాతావరణంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. దోమల



ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, జికా వ్యాధులు వ్యాపిస్తాయని, పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. డెంగ్యూ జ్వరము ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన తీవ్ర జ్వరము అకస్మాత్తుగా వస్తుందని, కళ్ళలో నొప్పి, శరీరంపై చిన్నపాటి దద్దుర్లు కనిపిస్తాయని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్ష చేయించుకోవడానికి రాపిడ్ డయాగ్నొస్టిక్ కిట్లు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో తెలంగాణ డయాగ్నొస్టిక్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలిసా టెస్ట్ అందుబాటులో ఉందని, ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. దోమల నివారణలో భాగంగా వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని, ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, మురుగు కాలువలలో చెత్తా చెదారం తొలగించాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో తగు చర్యలు చేపట్టాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంబంధిత శాఖల సమన్వయంతో పని చేస్తూ జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు . ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రవి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ పశువుల రవాణా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు

**జిల్లావ్యాప్తంగా చెక్ పోస్టులలో తనిఖీలు: డీసీపీ ఏ.భాస్కర్**

**మంచిర్యాల, మే 15 (తెలంగాణ వాణి):**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం మంచిర్యాల జోన్ పరిధిలోని గోరక్షక్ సభ్యులతో మంచిర్యాల పట్టణ కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో పశువుల అక్రమ రవాణా నిరోధంపై సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో చట్టపరమైన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పోలీస్ శాఖ చేపడుతున్న చర్యల గురించి డీసీపీ వివరించారు.డీసీపీ మాట్లాడుతూ.. పశు వుల అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా గోరక్షక్ సభ్యులతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాల ప్రకారం ఆవులు, దూడలను వధించడం నిషేధించబడిందని పేర్కొన్నారు.అలాగే పశువులు లేదా ఇతర మూగజీవాలను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించే సమయంలో వాటికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని చెప్పారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్,కౌస్లాటర్



యాక్ట్, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గోరక్షక్ పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా వాటిని పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు, రూరల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, లక్షెట్టిపేట్ సీఐ రమణమూర్తి, శ్రీరాంపూర్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్,మంచిర్యాల జోన్ ఎస్ఐలు పాల్గొన్నారు.



# పెద్ది' పవర్ ప్లే టూర్ షురూ..
# 8 రోజుల్లో 7 నగరాలు, భారీ వేడుకలకి పక్కా స్కెచ్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం కోసం అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన రెండు గ్లింప్స్, రెండు పాటలు సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. ముఖ్యంగా ఈ సినిమాలో రామ్ చరణ్ కుస్తీతో పాటు క్రికెట్ ఆడే పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే విడుదలైన విజువల్స్ స్పష్టం చేశాయి. మాస్, ఎమోషన్, స్పోర్ట్స్ అంశాల కలయికగా రూపొందుతున్న ఈ చిత్రంపై రోజురోజుకీ హైప్ పెరుగుతోంది. ఇప్పుడు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ను కూడా భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. ఓ అభిమాని "పెద్ది ప్రమోషన్స్ ఎక్కడ?" అంటూ లేఖ రాయగా, దానికి స్పందించిన చిత్రబృందం 'పవర్ ప్లే టూర్' పేరుతో ప్రత్యేక ప్రమోషనల్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో ఏ తేదీన ఏ నగరంలో ఈవెంట్ జరుగుతుందో ప్రకటించారు. మే 18న ముంబైలో భారీ వేడుక నిర్వహించి 'పెద్ది' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత మే 22న ఉప్పల్ స్టేడియంలో భారీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ వేడుకలో ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్‌తో ప్రత్యేక సంగీత కచేరీ నిర్వహించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. మే 23న భోపాల్‌లో ప్రత్యేక పాటల విడుదల కార్యక్రమం ఉండనుండగా, మే 24న బెంగళూరులో మరో భారీ ఈవెంట్ జరగనుంది. అనంతరం మే 28న ఢిల్లీలో, మే 30న చెన్నైలో ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇక జూన్ 1న విజయనగరంలో అభిమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. సినిమా కథ విజయనగరం నేపథ్యంతో సాగనున్న నేపథ్యంలో అక్కడి ఈవెంట్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. చివరగా జూన్ 2న హైదరాబాద్‌లో భారీ ప్రీ రిలీజ్ వేడుకను అభిమానుల మధ్య నిర్వహించనున్నారు. మొత్తంగా కేవలం 8 రోజుల్లో 7 నగరాల్లో 'పెద్ది' ప్రమోషన్స్ ప్లాన్ చేయడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. "ఇదే అసలైన పాన్ ఇండియా ప్రమోషన్" అంటూ రామ్ చరణ్ అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. ట్రైలర్ విడుదలతో 'పెద్ది' ఫీవర్ మరింత పెరగనుందని, విడుదలకు ముందే సినిమా దేశవ్యాప్తంగా భారీ హైప్ సృష్టించడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# రష్మిక కష్టాలు ..
# కాళ్లకు టేప్ వేసుకొని మరి..!

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా కేరళలో జరిగిన షెడ్యూల్‌లో కీలకమైన స్టంట్స్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. షెడ్యూల్ పూర్తైన సందర్భంగా యూనిట్ సభ్యులతో కలిసి తీసుకున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన రష్మిక.. "ఇంత కష్టపడి పనిచేసిన నా టీమ్‌కు థ్యాంక్యూ.. త్వరలో మళ్లీ సెట్స్‌లో కలుద్దాం" అంటూ ఎమోషనల్‌గా స్పందించారు.

# హీరో ఇష్యూ మానసికంగా నన్ను ఇబ్బంది పెట్టింది..
# చాలా బాధ పడ్డాను..



నిత్యా మీనన్ కు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషలలో దాదాపు 50కి పైగా సినిమాల్లో నటించి తనదైన ముద్ర వేశారు. 2011లో వచ్చిన 'అలా మొదలైంది' సినిమాతో టాలీవుడ్‌లోకి అరంగేట్రం చేసి మొదటి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత 'ఇష్క్', 'గుండెజారి గల్లంతయ్యిందే', 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'జనతా గ్యారేజ్' 'భీమ్లా నాయక్' వంటి సినిమాలతో సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం తమిళం, మలయాళంలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తూ బిజీగా ఉంటుంది. అయితే గతంలో ఓ ఇంటర్వ్యూలో నిత్యా మీనన్ మాట్లాడుతూ ఓ హీరో ఇష్యూ కారణంగా తాను చాలా బాధపడ్డానని అన్నారు. నిత్యా మీనన్ కెరీర్ ఆరంభంలో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ "ప్రభాస్ ఎవరు?" అని అడగడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. ఈ విషయంపై ఆమె క్లారిటీ ఇస్తూ, ఆ సమయంలో తాను చాలా అమాయకంగా ఉండేదాన్నని, కేవలం ఆ ఒక్క మాటను పట్టుకుని తనను చాలా ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన నిజాయితీని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఆ విషయాన్ని పెద్దది చేశారని ఆమె పేర్కొన్నారు. ఆ సంఘటన తర్వాతే అందరి దగ్గర నిజాయితీగా ఉండకూడదని, కొన్నిసార్లు 'డిప్లొమాటిక్'గా వ్యవహరించడం అవసరమని తాను నేర్చుకున్నానని నిత్య చెప్పారు. "ప్రతి ఒక్కరూ నా నిజాయితీకి అర్హులు కారు" అని ఆ ఇష్యూ ద్వారా తనకు అర్థమైందని, ఆ తర్వాతే తాను లోకజ్ఞానాన్ని పెంచుకున్నానని వివరించారు. ప్రభాస్ ఇష్యూ కారణంగా తాను మానసికంగా ఇబ్బంది పడ్డానని అన్నారు. అలాగే తన గురించి వచ్చిన ట్రోల్స్ పై స్పందిస్తూ.. దాదాపు రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండి, తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించానని, ఆ సమయంలో కొన్ని ఫేక్ ఫోటోలు సృష్టించి తనను మానసికంగా కృంగదీసే ప్రయత్నం చేశారని ఆమె తెలిపారు. కొన్ని ఘటనలు తన జీవితంలో ఒక పెద్ద పాఠం నేర్పిందని, అప్పటి నుండి తాను మనుషులను అంచనా వేయడంలో చాలా మారానని నిత్యా మీనన్ ఈ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

# నాగబాబు మేము'కాప్'లం ట్రైలర్ వచ్చేసింది



జీ5 ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో డిఫరెంట్ వెబ్ సిరీస్‌తో ఆడియెన్స్‌ను అలరించటానికి సిద్ధమైంది. అదే "మేము'కాప్'లం". కొన్నాళ్ల నుంచి ఈ సిరీస్ టైటిల్ దగ్గర నుంచి ప్రతీ విషయంలోనూ క్యూరియాసిటీని పెంచుతోంది. మే 22 నుంచి ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌పై మరింత ఆసక్తిని పెంచేలా "మేము'కాప్'లం" ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. మహదేవపట్నం అనే ప్రాంతంలో కథ మొదలవుతుంది. అయ్యగారు వారసుడొచ్చాడండోయ్.. అని పాలేరు అని అరిచి మరి చెబుతాడు. అప్పుడు గజపతిరాజు పాత్రలో నటించిన నాగబాబు ఆనందపడతాడు. సలార్‌రాజు తన వారసుడు అని ప్రకటిస్తాడు. అయితే అనుకోకుండా ఆ సలార్ రాజు కనిపించకుండా పోతాడు. దీంతో ఊరంతా గందరగోళంలో పడుతుంది. ఇంతకీ సలార్ రాజు ఎవరో కాదు.. కోళ్ల పందెల్లో పాల్గొనాల్సిన కోడిపుంజు. దీన్ని వెతకటానికి ఇద్దరు పోలీసులు(గెటప్ శీను, రవితేజ నన్నిమల) ఊళ్లోకి వస్తారు. సలార్ రాజు కనిపించకపోవటం వల్ల..ఎవరికి లాభం అనే కోణంలో పోలీసులు అన్వేషిస్తుంటారు. అయితే వారికి ఊళ్లో మరో సమస్య కనిపిస్తుంది. దీంతో వాళ్లు కొత్త సమస్య నుంచి ఊరిని బయటపడేయటానికి ప్రయత్నిస్తారు. ఇంతకీ మహదేవపట్నంలోని ప్రధాన సమస్య ఏంటి? పోలీసులు దాన్ని ఎలా పరిష్కరిస్తారు. అసలు ఇంతకీ సలార్ రాజు దొరికాడా? లేదా? అనే విషయాలు తెలియాలంటే మే 22న జీ5లో స్ట్రీమింగ్ కానున్న "మేము'కాప్'లం" వెబ్ సిరీస్ చూడాల్సిందేనంటున్నారు మేకర్స్.

నాగబాబు ప్రధాన పాత్రలో నటించిన "మేము 'కాప్'లం" సిరీస్‌ను రా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి, కౌముది కె నేమాని నిర్మాతలుగా ప్రదీప్ మద్దాలి క్రియేటివ్‌తో కలిసి రూపొందింది. 'వికటకవి' డైరెక్టర్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. శోభన్ చిట్టుప్రోలు కథను అందించారు. గెటప్ శ్రీను, రవితేజ నన్నిమల కీలక పాత్రల్లో నటించారు. కామెడీ, మిస్టరీ కలయికగా అందరినీ ఆకట్టుకునే కథాంశంతో..గ్రామీణ నేపథ్యంలో, అక్కడి రోజువారీ జీవితం, స్థానిక రాజకీయాలు, ఊహించని గందరగోళం..ఇలా అన్నీ కలగలిపిన ఆసక్తికరమైన కథతో ఈ సిరీస్ తెరకెక్కింది.



# విరోష్ జంట.. సోషల్ మీడియాలో సరికొత్త రికార్డ్

ఈ ఏడాది పెళ్లిబంధంలోకి అడుగుపెట్టిన జంట విజయ్- రష్మిక. కొన్నేళ్లుగా డేటింగ్ ఉన్న వీరిద్దరు ఉదయ్‌పూర్ వేదికగా ఒక్కటయ్యారు. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో పెళ్లిబంధంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో టాలీవుడ్ సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఈవెంట్ నిర్వహించారు. అయితే విరోష్ జంటగా క్రేజ్ తెచ్చుకున్న వీరిద్దరు ఓ యాడ్ ప్రమోట్ చేశారు. ప్రముఖ ఎయిర్ బీఎన్ బీ కపుల్ యాడ్‌లో పాల్గొన్నారు. దీనికి ఏకంగా 9.1 మిలియన్ లైక్స్ వచ్చాయి. దీంతో ఇన్‌స్టాలో మరో గ్లోబల్ రికార్డ్ క్రియేట్ జంటగా విరోష్ జోడీ నిలిచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక యాడ్‌కు వరల్డ్ వైడ్‌గా వచ్చిన రెండో అత్యధిక లైక్స్ ఇవే కావడం విశేషం. దీంతో విజయ్- రష్మిక ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం వీరిద్దరు జంటగా రణబాలిలో కనిపించనున్నారు.

మొదటి ప్లేస్ కూడా వీరిదే..

ఈ జాబితాలో మొదటి స్థానం రికార్డ్ సైతం వీరిదే కావడం గమనార్హం. గతంలో వీరిద్దరూ కలిసి చేసిన మాన్యవార్ అనే వెడ్డింగ్ యాడ్ 11.5 మిలియన్లకు పైగా లైక్స్ సాధించి అగ్రస్థానంలో నిలిచింది. దీనికి తోడు 104 మిలియన్ల వ్యూస్ రావడం విశేషం. ప్రముఖ దిగ్గజాలు మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో వంటి గ్లోబల్ ఐకాన్స్ కలిసి చేసిన ఇంటర్నేషనల్ బ్రాండ్ యాడ్స్‌కు మించిన ఆదరణ విరోష్ జంటకు అందరినీ షాకింగ్‌కు గురి చేస్తోంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S) Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com